విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily






సంపుటి : 4 | సంచిక :5 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 31 మే 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## ఆపరేషన్ సింధూర్ 2.0'కు భారత్ సన్నద్ధం

- త్రివిధ దళాలు అలర్ట్ అన్న ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది!
- భారత సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సంచలన వ్యాఖ్యలు
- శత్రు దేశాల కుతంత్రాలను తిప్పికొట్టేందుకు, దేశ రక్షణే ధ్యేయంగా భారత్ 'ఆపరేషన్ సింధూర్ 2.0'కు సన్నద్ధమవుతోంది
- కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ చర్యలకు ప్రతిస్పందనగా భారత్ అవలంబించిన కఠిన సైనిక వైఖరి ఇంకా కొనసాగుతూనే ఉంది



## డీఎస్సీ నిర్వహణపై ఆరోపణలు అవాస్తవం


- మెరిట్ ఆధారంగానే నియామకాలు: కోన శశిధర్
- డీఎస్సీ ఎంపికలో అర్హత ఉన్నవారిని ఎవరినీ పక్కనపెట్టలేదన్న విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్
- డీఎస్సీ నోటిఫికేషన్‌ను అడ్డుకునేందుకు 241 కేసులు వేసినా కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడి

అమరావతి

మెగా డీఎస్సీ-2025 నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరగలేదని విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. 2018 తర్వాత మళ్లీ 2025లో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్?ను అడ్డుకునేందుకు 241 కేసులు వేసినా రికార్డు టైంలో 148 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేశామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఒకే సబ్జెక్టుకు వివిధ తేదీల్లో పరీక్షలు నిర్వహించడంతో వేర్వేరు పేపర్లే ఉంటాయని విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ వివరించారు. ఒక్కో సబ్జెక్టుకు సుమారు 3 వేల ప్రశ్నలతో క్వశ్చన్ బ్యాంకు రూపొందించామని కోన శశిధర్ తెలిపారు.

వివరాలు 2లో..

# తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే



- గొడ్డలితో రాజకీయాలు చేస్తారా?
- ఇలాంటివాళ్లు ప్రజాస్వామ్యానికి పనికిరారు: సీఎం చంద్రబాబు
- సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారన్న చంద్రబాబు
- ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారని వ్యాఖ్య
- ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు
- తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై..
- తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది.

అమరావతి

గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్దీ సైకోలో ఫ్రస్ట్రేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు.'వైఎస్సార్సీపీ నెవ్వర్ ఎగైన్?, ఎన్డీయే ఎగైన్? అండ్ ఎగైన్?' అనేది కూడా ప్రజల నినాదంగా మారుతోందని వెల్లడించారు. ఇప్పుడు వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు తనకు కూడా కొన్ని తెలియవన్నారు. 30 ఏళ్ల క్రితమే కడప జిల్లాలో పాలెగాళ్ల రాజ్యంపై వేసిన పుస్తకాన్ని ఇప్పుడు అందరూ చదువుతున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారని స్పష్టంచేశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో తాజా రాజకీయ పరిణామాలపై చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. నక్సలైట్లు గన్‌తో రాజ్యాధికారాన్ని సాధించలేరని చంద్రబాబు

వివరాలు 2లో..



## "విశ్వగురువు అని ప్రగల్భాలు పలకడమే

- ఒక్క పరీక్ష కూడా సరిగ్గా నిర్వహించలేరు"
- మోదీపై రాహుల్ విమర్శలు
- దేశంలో విద్యావ్యవస్థ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయింది
- దేశానికి చదువుకున్న ప్రధానమంత్రి అవసరం ఎంతైనా ఉంది
- కేజ్రీవాల్ ఘాటు వ్యాఖ్యలు

## ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాలో ఎస్ఐఆర్ ఒకటి

- విపక్షాల విమర్శల వేళ సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- గత కొంతకాలంగా ఎస్ఐఆర్‌పై విమర్శలు గుప్పిస్తున్న విపక్షాలు
- సీఈసీతో కలిసి పనిచేస్తున్న దేశంలోని ప్రముఖ న్యాయవాదులందరికీ, అలాగే 11 లక్షల బూత్ స్థాయి అధికారులు, 15 లక్షల బూత్ స్థాయి ఏజెంట్లకు వందనాలు"





## రేపు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాల్వలకు నీటి విడుదల

- తూ.గో. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం
- రేపు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాల్వలకు నీటి విడుదలకు నిర్ణయం
- దశల వారీగా కాల్వలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయం

అమరావతి

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి డెల్టా కాలువల్లోకి సాగునీటిని రేపటి నుంచి విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా, ముందస్తు ఖరీఫ్ సీజన్ కోసం నీటిని విడుదల చేసే నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. కాలువలపై మరమ్మతు పనులు కొనసాగుతున్న దృష్ట్యా, డెల్టా కాలువలకు నీటిని దశలవారీగా విడుదల చేయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. వివిధ కాలువల నిర్దిష్ట పరిస్థితులను బట్టి, ఆయా కాలువలకు నీటి విడుదల ప్రక్రియ దశలవారీగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశమైంది. ఈ సమావేశంలో తూర్పు గోదావరి

వివరాలు 2లో..

## కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో భారీ రద్దీ

- ఉత్తరాఖండ్‌లో కొనసాగుతున్న చార్‌ధామ్ యాత్ర
- కేథార్‌నాథ్ ధామ్‌కు భారీగా తరలివస్తున్న భక్తులు
- ఆ నడక మార్గంలో భారీగా రద్దీ
- దీంతో ఇబ్బంది పడుతున్న వృద్ధ భక్తులు, చిన్నారులు



## రాజస్థాన్‌లో ఇసుక తుపాన్ బీభత్సం

- పట్టపగలే చిమ్మచీకట్లు!
- రాజస్థాన్‌లోని చురు, బికనేర్ ప్రాంతాల్లో చెలరేగిన ఇసుక తుపాన్
- ఆ తరువాత కురిసిన భారీ వడగళ్ల వాన





## కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్

- జూన్ 3న ప్రమాణస్వీకారం
- జూన్ 3న డీకే ప్రమాణస్వీకారం
- స్వయంగా ప్రకటించిన కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్

# దేశంలో విభిన్నంగా చెత్త సేకరణ విధానం

- జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్'ను సందర్శించిన పవన్
- పనితీరు, నిర్వహణపై ఆరా
- జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించిన పవన్
- చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి తయారు చేస్తున్న జిందాల్ ప్లాంట్



పల్నాడు

ఒక క్రమపద్ధతిలో చెత్తను సేకరిస్తే, దాని వినియోగం ద్వారా అద్భుతాలు చేయవచ్చని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌ను ఆయన సందర్శించారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్రక్రియను ఆసాంతం పరిశీలించారు. చెత్తను ఎలా వేరు చేస్తారు దాన్ని ప్లాంట్‌లో ఎలా శుద్ధి చేస్తారు దేనికి ఉపయోగిస్తారనే విషయాలను ప్లాంట్ ప్రతినిధులు పవన్‌కు వివరించారు. ముఖ్యంగా చెత్తను బాయిలర్లలో మండించడం ద్వారా విద్యుత్ తయారీ ఎలా జరుగుతుంది చివరికి బూడిదను ఇటుకల తయారీకి ఎలా వినియోగించుకోవచ్చు అనే విషయాలను ప్లాంట్ ప్రతినిధులు పవన్‌కు

వివరాలు 2లో..

# దేశంలో విభిన్నంగా చెత్త సేకరణ విధానం

-మొదటిపేజీ తరువాయి

వివరించారు. ఈ సందర్భంగా ఏపీకి చెత్త సేకరణ విషయంలో ఉన్న అవకాశాలను జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ ఎంవీ చారి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్?కు వివరించారు.

రాష్ట్రంలో రోజువారీగా 7200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తవుతుంది. కొండవీడు జిందాల్ ప్లాంట్ సామర్థ్యం రోజువారీ 1400 టన్నుల పొడి చెత్తను ప్రాసెస్ చేసి, సగటున 20 మెగావాట్ల విద్యుత్?ను ఉత్పత్తి చేస్తోంది. దాన్ని రాష్ట్ర విద్యుత్ గ్రిడ్?తో అనుసంధానం చేసి, ఏపీ ఇంధన అవసరాలు తీరుస్తోంది. విశాఖలోనూ జిందాల్ ప్లాంట్ ఉత్తరాంధ్ర రీజియన్ చెత్తను సేకరించి 15 మెగావాట్ల కరెంట్? ఉత్పత్తి చేస్తోంది. ఈ తరహా ప్లాంట్లను రాష్ట్రంలో మరో ఆరు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పవన్ కల్యాణ్? తెలిపారు. కాకినాడలో ఇప్పటికే పనులు మొదలు కాగా, నెల్లూరు, వైఎస్సార్ కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో కూడా త్వరలో ఏర్పాటు చేసేందుకు సర్కార్? సుముఖంగా ఉన్నట్లు స్పష్టంచేశారు.

బయో మిథలైజేషన్ ప్లాంట్ల నుంచి బయో గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని ప్లాంట్ ప్రతినిధులు తెలిపారు. పూలు, పండ్లు, కూరగాయాలు, ఆహార వ్యర్థాలను క్రమపద్ధతిలో వేరు చేసి దాని ద్వారా కూడా గ్యాస్ ఉత్పత్తి చేయొచ్చని చెప్పారు. అయితే చెత్త సేకరణ దానిని వేరు చేయడంపై కసరత్తు జరగాలని ఉప ముఖ్యమంత్రి దృష్టికి ప్లాంట్ ప్రతినిధులు తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన పవన్ ?చెత్తను వేరు చేయడం, వివిధ మార్గాల్లో ఉపయోగించుకోవడం ప్రధానమన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన రావాలని అభిప్రాయపడ్డారు.

'గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా నిర్వహించాలనే పట్టుదలతో కూటమి ప్రభుత్వం ఉంది. గోదావరిలో కలుస్తున్న వ్యర్థాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని భావిస్తున్నాం. ముఖ్యంగా చెత్త నిర్వహణకు జిందాల్ అనుసరిస్తున్న విధానాన్ని అమలు చేస్తాం. గోదావరి పుష్కరాలకు సంబంధించి 268 పంచాయతీలు ప్రత్యక్షంగా భాగస్వామ్యమవుతాయి. ఈ పంచాయతీల్లో చెత్త నిర్వహణ అనేది చాలా కీలకం. నదిలోకి వ్యర్థాలను విడుదల



చేయకుండా, దానిని అందంగా, కాలుష్య రహితంగా తీర్చిదిద్దడం మీద పంచాయతీల అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని' నిర్ణయించినట్టు పవన్ వివరించారు.

సింగపూర్?లో వినియోగించే విద్యుత్?లో 2.8 శాతం చెత్త నుంచి ఉత్పత్తవుతుందని పవన్ కల్యాణ్ వెల్లడించారు. కానీ మన దేశంలో చెత్త సేకరణ విధానం విభిన్నంగా ఉంటుందని గుర్తు చేశారు. సింగపూర్ టాంజాంగ్ టెర్మినల్లో చెత్తను వేరు చేసే ప్రక్రియ చాలా పద్ధతిగా జరుగుతుందన్నారు. అలాంటిది విశాఖపట్నం పోర్టులో కూడా అనుసరించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. మన దేశంలో మధ్యప్రదేశ్?లోని ఇండోర్ నగరపాలక సంస్థ చెత్త సేకరణ విధానం ఆదర్శంగా ఉందని తెలిపారు. చెత్తను ప్రజల దగ్గర నుంచి సేకరించడంతో పాటు వినియోగం వరకు స్ఫూర్తిగా నిలుస్తోందని పవన్ అభిప్రాయపడ్డారు. 'ఇండోర్ వేస్ట్ మేనేజ్మెంట్ మోడల్ రాష్ట్రంలోని అర్బన్, గ్రామీణ ప్రాంతాలకు ఆదర్శం కావాలి. ఏపీని డంపింగ్ యార్డు రహితంగా తీర్చిదిద్దాలంటే వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్స్? మరిన్ని అవసరం. ప్రతి 100 కిలోమీటర్లకు ఒక ప్లాంట్ ఉండటం ద్వారా ఆయా నగరపాలక, మున్సిపాలిటీల చెత్తతో పాటు చుట్టుపక్కలున్న గ్రామ పంచాయతీల ద్వారా కూడా చెత్తను సులభంగా సేకరించే అవకాశం ఉందని' పవన్ పేర్కొన్నారు.

ఒక మెగావాట్ విద్యుత్ తయారీకి అవసరమయ్యే ప్లాంట్? నిర్మాణానికి రూ.25 కోట్ల మేర ఖర్చువుతుందని పవన్ కల్యాణ్ వివరించారు. అలాగే ఒక మెగావాట్ కరెంట్ తయారీకి సగటున 2.5 టన్నుల చెత్తతో పాటు 4.5 టన్నుల స్టీమ్ అవసరం అవుతుందని తెలిపారు. ఈ ప్లాంట్ల ఏర్పాటుతో స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించారు. ఈ క్రమంలోనే విద్యుత్? ఉత్పత్తితో పాటు వివిధ రకాలైన పంచాయతీల్లో చెత్త నిర్వహణకు సంబంధించి క్లస్టర్ల వారీగా అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

# డీఎస్సీ నిర్వహణపై ఆరోపణలు అవాస్తవం

-మొదటిపేజీ తరువాయి

పర్మినెంట్ ఉద్యోగాలైన ఇద్దరికి మాత్రమే క్వశ్చన్ బ్యాంకుకు యాక్సెస్ ఉండదని, ప్రతి రోజూ పాస్ వర్డ్స్ మారుతూ ఉంటాయని కోన శశిధర్ స్పష్టం చేశారు. 100కు పైగా ఎస్?ఎస్?సీ, ఆర్ఆర్?బీ, హైకోర్టు పరీక్షలు వంటివి నిర్వహించిన టీసీఎస్ ఐయాన్?కే ఈ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ఇది మాన్యువల్ ఎగ్జామ్ కాదు అని, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పద్ధతిలో మెగా డీఎస్సీ నిర్వహించామని వెల్లడించారు. స్కోర్స్ ఇవ్వలేదని చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కోన శశిధర్ మండిపడ్డారు.

### పారదర్శకంగానే నియామకాలు

సర్టిఫికెట్ వెరిఫికేషనులో భాగంగా ముందుగా ఆన్?లైన్?లో అప్?లోడ్ చేయాలని నిబంధన పెట్టామని, వెరిఫికెషన్?కు వచ్చినప్పుడు తెస్తామని రిక్వెస్ట్ చేయడంతో ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. గతానుభవాల దృష్ట్యా వెయిటింగ్ లిస్టు కాకుండా 1:1 పద్ధతిలో పిలిచామని దీన్ని ఆనాడే అందరికీ చెప్పామని విద్యాశాఖ కార్యదర్శి వెల్లడించారు. వెరిఫికేషన్లో ఎవరైనా ఫెయిల్ అయితే ఆ తర్వాత వారిని వెరిఫికేషన్?కు పిలిచామన్నారు. హారిజాంటల్ రిజర్వేషన్లు స్పోర్ట్స్, మహిళ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్ మెన్?కు ఇవ్వాల్సి ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్లే కోర్టులు డీఎస్సీ-2025 నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయని తేల్చి చెప్పారు. కొంతమందికి ఉన్న అనుమానాలను నివృత్తి చేశామని తెలిపారు. సంవత్సరం పూర్తైన తర్వాత ఇప్పుడు ఆరోపణలు చేయడం ఆశ్చర్యంగా ఉందని కోన శశిధర్ ఆక్షేపించారు.

### దరఖాస్తు సమయంలోనే సర్టిఫికెట్లు అప్లోడ్

డీఎస్సీ అభ్యర్థుల మార్కులను వెబ్సైట్లో ప్రచురించామన్నారు. మార్కులు ప్రచురించలేదని కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తు సమయంలోనే అన్నీ సర్టిఫికెట్లు అప్లోడ్ చేయాలని చెప్పామన్నారు. వేర్వేరుచోట్ల చదవడం వల్ల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ సమయంలో చూపిస్తామని అభ్యర్థించారని తెలిపారు. మరికొందరు అభ్యర్థులు ఈ నిబంధన సడలించాలని కోరడంతో మార్చామని తెలియజేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్కు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచామన్నారు. స్పోర్ట్స్, డిసేబిలిటీ, మహిళలు, ఎక్స్సర్వీస్మెన్లకు హారిజాంటల్ కోటా అమలు చేశామని పేర్కొన్నారు.

### అర్హత ఉన్నవాళ్లెవరినీ పక్కన పెట్టలేదు

హారిజాంటల్ రిజర్వేషన్ల వల్ల కొందరు మెరిట్ అభ్యర్థులకు పోస్టు రాలేదు. డీఎస్సీలో అక్రమాలు చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని తేల్చిచెప్పారు. అర్హత ఉన్నవాళ్లను ఎవరినీ పక్కన పెట్టలేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానాలు ఇచ్చామన్నారు. మేం చెప్పిన సమాధానాలకు కోర్టులు సంతృప్తి చెందాయన్నారు. కోర్టులు సంతృప్తి చెందడం వల్లే నియామకాలకు ఎలాంటి అడ్డంకులు రాలేదని వివరించారు. డీఎస్సీ నిర్వహణలో ప్రతీది పద్ధతి ప్రకారమే జరిగిందని మరోసారి కోన శశిధర్ గుర్తు చేశారు.

"డీఎస్సీ దరఖాస్తు సమయంలోనే అన్ని సర్టిఫికెట్లను అప్లోడ్ చేయాలని చెప్పాం. వేర్వేరుచోట్ల చదవడం వల్ల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ సమయంలో చూపిస్తామని అభ్యర్థించారు. మరికొందరు అభ్యర్థులు ఈ నిబంధన సడలించాలని కోరడంతో మార్చాం. సర్టిఫికెట్ వెరిఫికేషన్కు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచాం. స్పోర్ట్స్, డిసేబిలిటీ, మహిళలు, ఎక్స్సర్వీస్మెన్లకు హారిజాంటల్ కోటా అమలు చేశాం. హారిజాంటల్ రిజర్వేషన్ల వల్ల కొందరు మెరిట్ అభ్యర్థులకు పోస్టు రాలేదు. అర్హత ఉన్నవాళ్లను ఎవరినీ పక్కన పెట్టలేదు. డీఎస్సీ నిర్వహణలో ప్రతీది పద్ధతి ప్రకారమే జరిగింది". - కోన శశిధర్, విద్యా శాఖ కార్యదర్శి

# కోస్తాజిల్లాల్లే వైసీపీ టార్గెట్

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కాపు సామాజిక వర్గం మరోసారి ప్రధాన చర్చగా మారుతోంది. ముఖ్యంగా జనసేన పార్టీ ఏర్పాటైన తర్వాత కాపు వర్గంలో రాజకీయంగా కొత్త మార్పులు కనిపించాయి. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పై ఉన్న అభిమానంతో పాటు తమ సమస్యలను ప్రస్తావించే వేదికగా జనసేనను భావించే వారు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఈ కారణంగా గత కొన్నేళ్లుగా కాపు వర్గం పెద్ద ఎత్తున జనసేనకు మద్దతుగా నిలుస్తోందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ పరిస్థితి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి రాజకీయంగా సవాలుగా మారిందనే చర్చ కొనసాగుతోంది. కాపు వర్గం ఒకే దిశలో నిలిస్తే భవిష్యత్ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ వర్గాన్ని రాజకీయంగా తటస్థంగా మార్చేందుకు వైసీపీ వ్యూహాలు సిద్ధం చేస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల వరకు కూటమి రాజకీయాలపై వైసీపీ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ మధ్య విభేదాలు వస్తాయని సోషల్ మీడియా వేదికలతో పాటు బహిరంగ సభల్లో కూడా వ్యాఖ్యలు వినిపించాయి. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం కూటమి కొనసాగుతుందని, వ్యక్తులు మారినా లక్ష్యం మారదని స్పష్టం చేశారు. దీంతో కూటమిలో చీలికలు సృష్టించే ప్రయత్నాలు ఫలించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కాపు వర్గాన్ని మళ్లీ ఉద్యమాల దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కాపు రిజర్వేషన్లు, సామాజిక హక్కులు, రాజకీయ ప్రాధాన్యత వంటి అంశాలను మళ్లీ ప్రస్తావనలోకి తీసుకురావాలనే ఆలోచన కొంతమంది నేతల్లో ఉందని చెబుతున్నారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో కాపు ఉద్యమం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చగా నిలిచింది. ఆ సమయంలో రిజర్వేషన్ల కోసం ఆందోళనలు



కూడా జరిగాయి. అయితే తర్వాత పరిస్థితులు మారిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాపు ఉద్యమం నెమ్మదించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ తమ తరఫున పోరాడతారనే నమ్మకం కాపు వర్గంలో ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇదే అంశం ఇప్పుడు వైసీపీకి ఇబ్బందిగా మారిందనే ప్రచారం కూడా జరుగుతోంది. దీంతో కాపు వర్గంలో మళ్లీ భిన్న అభిప్రాయాలు వచ్చేలా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారనే చర్చ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. క్షేత్రస్థాయిలో కొన్ని వర్గాలతో చర్చలు జరుగుతున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి పెంచేలా ఉద్యమాలను ప్రోత్సహించే వ్యూహం అమలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ ప్రచారాలపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. కానీ కాపు వర్గం రాజకీయంగా ఎటు వైపు నిలుస్తుందన్నది భవిష్యత్ ఎన్నికల్లో కీలక అంశంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కాపు ఓటు బ్యాంక్ చుట్టూనే అనేక వ్యూహాలు తిరుగుతున్నాయనే చర్చ కొనసాగుతోంది.

## 'తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. అలాంటిది వీళ్ల గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. హత్య రాజకీయాలు చేసిన వారు రాష్ట్రాన్ని పరిపాలించవచ్చు? కానీ బాధితులు మాత్రం జిల్లా రాజకీయాలు చేయకూడదన్నట్లుగా? వీరి సిద్ధాంతం ఉందని విమర్శించారు. వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉందన్నారు. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉందని తెలిపారు. సునీత పోరాటం కారణంగానే ఇప్పటికీ వివేకా హత్య కేసు సజీవంగా ఉందని చెప్పారు. నేటి తరానికి కూడా వీళ్ల హత్య రాజకీయాలు తెలుస్తున్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

అంతకుముందు చంద్రబాబు ప్రాంతీయ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో మైండ్ గేమ్ ఆడే గొడ్డలి పార్టీ పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ, వారి కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు. ప్రాంతీయ కోఆర్డినేటర్లు తమ తమ నియోజకవర్గాల పరిధిలోని క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగన్ కుటిల రాజకీయాలను క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ ఎండగట్టాలని చంద్రబాబు స్పష్టంచేశారు.

ఆ వ్యాఖ్యలు సరికాదు : ఏపీతో పాటు ఈసారి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మహానాడు బాగా జరిగిందని నేతలు, చంద్రబాబుకు వివరించారు. మహానాడు కార్యక్రమంలో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలు సరికాదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని చంద్రబాబు హితవు పలికారు.

'తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటే. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదు. తెలుగుదేశం పార్టీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని, తెలంగాణలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం తరువాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయి. తెలంగాణలో ఉత్సాహంగా మహానాడు నిర్వహించడంపై పార్టీ శ్రేణులకు అభినందనలు. మహానాడులో ఆమోదించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి' అని చంద్రబాబు నేతలకు దిశానిర్దేశం చేశారు. 'పునర్విభజన, మహిళ బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. ఈ రెండు బిల్లులు కలిపి వస్తేనే నారీమణులకు న్యాయం జరుగుతుంది. ఈ రెండు బిల్లులు దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తాయి. తెలుగుదేశం ప్రకటించిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడూ అన్ని పార్టీలు కూడా స్వాగతించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అతివలకు మొదటి నుంచి టీడీపీ అండగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనలో 2011 జనాభా లెక్కలైనా, తాజా జనాభా లెక్కలైనా దక్షిణాదికి నష్టం. అందుకనే ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే న్యాయం జరుగుతుంది. దీనివలన ఎవరికి నష్టం ఉండదని' చంద్రబాబు స్పష్టంచేశారు.

### చంద్రబాబును కలిసిన ఆశావాహులు

త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ క్రమంలో రేస్లో ఉన్న ఆశావాహులు చంద్రబాబును కలిసి తమకు అవకాశం పరిశీలించాలని కోరారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలోనూ, సచివాలయంలోనూ, పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇలా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చంద్రబాబు, లోకేశ్?ను కలిసి రాజ్యసభలో తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇలా గత రెండు రోజుల్లో వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్ రావు, రెడప్పగారి శ్రీనివాసరెడ్డి, టీడీ జనార్ధన్, చింతకాయల విజయ్, తిప్పేస్వామి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

## రేపు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాల్వలకు నీటి విడుదల

-మొదటిపేజీ తరువాయి

జిల్లాలో ఖరీఫ్--2026 పంట సీజన్కు సాగునీటి సరఫరాకు సంబంధించి చర్చలు జరిపి, తగిన నిర్ణయాలు తీసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశంలో పాల్గొని, తమ ఆందోళనలను వ్యక్తం చేస్తూ, తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతు కోసం రూ.148 కోట్ల నిధులను విడుదల చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఒక తీర్మానం ఆమోదించారు. గోదావరి నదిలో కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు కేటాయించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్కు ధన్యవాదాలు తెలుపుతూ మరొక తీర్మానం చేశారు. అంతేకాకుండా గోదావరి నదిలో కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రత్యేక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేసినందుకు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ మరో తీర్మానాన్ని ఆమోదించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, రైతులు ముందస్తుగా విత్తన నాటకం పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. 'ఎల్?నినో' ప్రభావం వల్ల వర్షపాతం లోటు ఏర్పడే పక్షంలో, తగినంత నీటి నిల్వలను నిర్ధారించడంపైనే ప్రధానంగా దృష్టి సారించి, దానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు కూడా ఆయన పేర్కొన్నారు.

రెండు రోజుల క్రితం ఇక్కడికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఇక్కడి నీటి కాలుష్యాన్ని తగ్గించే విధంగా పంచాయతీ రాజ్ శాఖ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తరఫున వంద కోట్లు రూపాయలు ఇస్తామని ప్రకటించినందుకు ధన్యవాదాలు. ప్రతి సంవత్సరం వచ్చే ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. రేపటి నుంచి ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. రైతన్నలందరూ నాట్లు వేసుకుని, పంట పండించుకోవడంతో పాటు సంక్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాం.

"జూన్ 1 నుంచి అక్టోబర్ 31 వరకు ఖరీఫ్ సీజన్కు నీటిని విడుదల చేసి, ముందుగానే నీటిని అందించడం ద్వారా భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి ఒక నెల ముందుగానే ఈ నీటి విడుదల గురించి రాష్ట్ర వ్యాప్తంగా నిర్ణయం తీసుకున్నారు. గోదావరి బ్యారేజ్కు సంబంధించిన ఇటువైపు వస్తున్న 84 వేల ఎకరాలు, అలాగే అటువైపు ఏలూరు డివిజన్ కింద వచ్చే 45 వేల ఎకరాల ఆయకట్టుకు సంబంధించిన నీటిని వదలాలని, ఆ తర్వాత ఇతర ఆయకట్టలకు ఫేజ్ మేనేజ్మెంట్ ప్రకారం నీటిని వదలాలని నిర్ణయించడం జరిగింది. మంచినీటి ఎద్దడి లేకుండా ఉన్నట్లయితే, రేపట్నుంచే నీటి విడుదల కార్యక్రమాన్ని చేపట్టాలనే ఆలోచన ఉంది. కరువు కాటకాలతో ఉన్న ప్రాంతాలను సస్యశామలం చేసిన కాటన్ బ్యారేజీ బాగోగులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఈ బ్యారేజీని రిపేర్ చేయాలి. రైతులకు ఈ బ్యారేజీ ద్వారా పూర్తిగా లాభం చేకూరాలనే ఆలోచనతో రూ. 148 కోట్లు విడుదల చేసినందుకు గోదావరి జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులే కాకుండా అందరం కూడా ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం."- కందుల దుర్గేష్, మంత్రి

## కార్యకర్తలతోనే జగన్ ఫేస్ టూ ఫేస్

**విజయవాడ :** వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎందుకు ఓటమి పాలు అయ్యామో గురించించారు. పార్టీని సొంతం అనుకుని తమ ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా 2019 ఎన్నికల్లో పనిచేసిన కార్యకర్తలు 2024 నాటికి పూర్తిగా గాలికి వదిలేశారు అన్నది బాగా ప్రచారంలో ఉంది. అందులో నిజం ఉందని వైసీపీ హైకమాండ్ కూడా భావిస్తోంది. అందుకే జగన్ కార్యకర్తలకు వైసీపీ 2.0 ప్రభుత్వంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని ఇప్పటిదాకా చెబుతూ వస్తున్నారు. ఇపుడు ఆయన నేరుగా ప్రతీ నియోజకవర్గంలోని కార్యకర్తలతో నేరుగా భేటీ వేస్తారు అని ప్రచారం సాగుతోంది. అది ఎపుడూ ఏమిటి అన్నది తెలియదు కానీ కార్యకర్తలతో అధినేత ముఖా ముఖీ సమావేశం అవుతారు అని అంటున్నారు. వైసీపీ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంచార్జిలను నియమించింది. అక్కడ నుంచి మునిసిపాలిటీలు, మండలాలు, గ్రామాలు వార్డులు ఇలా బూత్ లెవెల్ దాకా కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ ఆదేశించింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ అయితే జోరుగా సాగుతోంది అని అంటున్నారు. ఇది పూర్తి కాగానే ప్రతీ కార్యకర్తకు పార్టీ తరఫున ఐడెంటిటీ కార్డు ఇస్తారని అంటున్నారు. ఆ విధంగా కార్యకర్తలు ఈ ఐడెంటిటీ కార్డుల ద్వారా నేరుగా జగన్ తో మమేకం అయ్యేలా పార్టీ నిర్మాణం చేపడుతున్నామని నేతలు చెబుతున్నారు పార్టీలో కమిటీలు పూర్తి చేసిన తరువాత పనిచేసే వారికే పదవులు అన్న విధానాన్ని అమలు చేస్తారని అంటున్నారు. అలాగే వారి యోగ క్షేమాలు అధినాయకత్వం పట్టించుకుంటూ ఎప్పటికప్పుడు నేరుగానే వారితో కనెక్ట్ అయ్యేలా ఒక వ్యవస్థను రూపొందిస్తున్నారు అని అంటున్నారు. ఇక జగన్ జిల్లాల పర్యటనలు ఉంటాయని చెబుతున్నారు. దాంతో జిల్లాల పర్యటనలో కార్యకర్తలతో ఆయన భేటీలు అవుతారని చెబుతున్నారు.

# ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న లక్ష్మీదేవి పేట బ్రిడ్జ్ సమస్య పై ఎంపీ ఫోకస్

- దశాబ్దానికి పైగా ఉన్న సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ.
- లక్ష్మీదేవి పేట ఆర్‌వోబీ నిర్మాణానికి రైల్వే నుండి సానుకూల స్పందన.



**అనకాపల్లి, పెన్ సత్తా, మే 30:**జిల్లా రైల్వే అభివృద్ధి కొరకు దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సీఎం రమేష్ భేటీ అయ్యారు. ఈ కీలక భేటీ లో అనకాపల్లి పట్టణంలో దశాబ్దానికి పైగా పెండింగ్‌లో ఉన్న లక్ష్మీదేవి పేట రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం. రమేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ లోని రైల్ నిలయం కార్యాలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తో సమావేశ మై పలు కీలక అంశాల పై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి పేట లోని లెవెల్ క్రాసింగ్ నెం.485 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరాన్ని ఎంపీ సీఎం రమేష్ జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంలో రోజువారీగా వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుండగా, రైల్వే గేటు మూసివేతల కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు పలుమార్లు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రజల భద్రతతో పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం లక్ష్మీదేవిపేట ఆర్‌ఓబి నిర్మాణాన్ని అత్యధిక ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టాలని కోరారు.

అదే విధంగా అనకాపల్లి జిల్లా పరిధిలో చేపట్టాల్సిన రైల్వే అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణ పనులు, ముఖ్యంగా రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతం, ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పన, రైల్వే కనెక్టివిటీ విస్తరణ, పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టుల వేగవంత మైన అమలు తదితర అంశాలను ఎంపీ జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని రైల్వే సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాదనల పై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. లక్ష్మీదేవిపేట ఆర్‌ఓబి తో పాటు అనకాపల్లి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇతర రైల్వే అభివృద్ధి పనుల అమలుకు అవసర మైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో రైల్వే రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని రైల్వే సదుపాయాలు తీసుకురావడానికి నిరంతరం కృషి కొనసాగిస్తామని ఎంపీ పేర్కొన్నారు.

# మెగా జాబ్ మేళాను ప్రారంభించిన సుందరపు





**అచ్యుతాపురం, పెన్ సత్తా, మే 30:** మండలం లోని ఏపీఐసీ వన్ స్టాప్ సెంటర్ పరిధిలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో 280 మంది యువతీ యువకులు పాల్గొనగా, 37 మంది ఉద్యోగాలు సాధించి నియామక పత్రాలు అందుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యలమంచిలి నియోజకవర్గంలో ఇది మూడోసారి నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఇంటిలో ఒక ఉద్యోగం ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం ఉన్నచోటే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్న ఆయన, యువత తమ విద్యా అర్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి కూడా వెనుకబడకూడదని, చదువు, నైపుణ్యాభివృద్ధితో సమాజంలో గౌరవప్రద మైన స్థానం సంపాదించు కోవాలని ఆకాంక్షించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, యువత నుంచి విశేష స్పందన లభించింది. స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించడం పట్ల ఉద్యోగార్థులు హర్షం వ్యక్తం చేశారు. యలమంచిలి నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తూ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వినియోగంలో లేని టిడ్కో, రాజీవ్ గృహకల్ప ఇళ్లు అర్హులైన పేదలకు అప్పగించాలి.

- గంగవరం నిర్వాసితులకు రావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలి.
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు.



**విశాఖపట్నం, పెన్ సత్తా, మే 30:** విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో అంశాల పై పల్లా శ్రీనివాసరావు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడ్కో, రాజీవ్ గృహకల్ప పథకాల కింద కేటాయించిన అనేక ఇళ్లలో లబ్ధిదారులు ఇప్పటికీ నివాసం ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల కేటాయింపులు జరిగి 17 నుంచి 18 సంవత్సరాలు గడిచినా, కొన్ని ఇళ్లకు ఇప్పటికీ తాళాలు కూడా వేయని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ఇళ్లు అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారుతున్నాయని, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ప్రభావం చుట్టుపక్కల నివసిస్తున్న కుటుంబాల పై తీవ్రంగా పడుతోందని పేర్కొంటూ, ఇంతకాలం గడిచినా ఇళ్లలో నివాసం ఉండని లబ్ధిదారుల కేటాయింపులను సమీక్షించి, అవసరమైతే రద్దు చేసి అర్హులైన పేద కుటుంబాలకు తిరిగి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ అంశాన్ని గతంలో పలుమార్లు ప్రస్తావించినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని పేర్కొనగా, ఈసారి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గాజువాక నియోజకవర్గ పరిధిలో వితంతువులు, వికలాంగులు కొత్తగా దరఖాస్తు చేసుకున్న పెన్షన్ల మంజూరులో జాప్యం జరుగుతోందని ప్రస్తావించారు. అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ, సంబంధిత అధికారులను కోరారు.

గంగవరం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన గంగవరం పోర్టు నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ.లక్ష చొప్పున జీవనభృతి, ఇతర ఆర్థిక ప్రయోజనాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని పల్లా శ్రీనివాసరావు అధికారులను కోరారు. నిర్వాసితుల సమస్యలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వారికి రావాల్సిన నిధులను తక్షణమే జమ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ అంశం పైనా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గాజువాక నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వేదికపై ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా, పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా అధికార యంత్రాంగంతో సమన్వయం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేవల్లపాలెం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం

12 ఏళ్ల నిరీక్షణకు తెర దించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు.





**మధురవాడ, పెన్ సత్తా, మే 30:**జీవీఎంసీ ఆరో వార్డు పరిధి మధురవాడ నుంచి రేవల్లపాలెం వెళ్లే 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గత 12 సంవత్సరాలుగా వివిధ కారణాల వల్ల నిలిచి పోయిన ఈరోడ్డు పనులను భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. దీంతో రేవల్ల పాలెం గ్రామస్తుల దశాబ్ద కాలపు నిరీక్షణకు తెరపడి నట్లయింది.?రేవల్లపాలెం గ్రామంలో రోడ్డు విస్తరణకు సంబంధించి మొత్తం 32 మంది లబ్ధిదారులకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం టీడీఆర్ లు అంద జేయాల్సి ఉంది అయితే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, సర్వే విభాగాల అలసత్వం కారణంగా ఆరు టీడీఆర్‌లు సుదీర్ఘకాలం పాటు పెండింగ్ లో ఉండిపోయాయి. ఆరు నెలల క్రితం వీటిలో మూడింటిని పరిష్కరించి నప్పటికీ మిగిలిన ముగ్గురు లబ్ధిదారులు నాగోతి ఎల్లా రావు, నాగోతి వెంకటరావు దేవర తాతబాబులకు టీడీఆర్‌లు అందలేదు దీంతో రోడ్డు పనులు పూర్తిగా నిలిచిపోయాయి.? రోడ్డు పనులు అర్థాంతరంగా ఆగి పోవడంతో రేవల్లపాలెం మీదుగా ప్రయాణించే వాహనదారులు, స్థానిక ప్రజలు గత కొన్నేళ్లుగా తీవ్ర నరకం అనుభవించారు. అధ్వాన్నంగా మారిన రహదారితో స్థానికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. తీవ్రమైన ఈ సమస్య పై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న మిగిలిన మూడు టీడీఆర్ సమస్యలను నెల రోజుల్లోగా పరిష్కరిస్తానని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే చొరవతో శనివారం రేవల్లపాలెం గ్రామంలో 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు పునఃప్రారంభ మయ్యాయి, ?గ్రామస్తుల ఆనందోత్సాహాలు ?రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో రేవల్లపాలెం గ్రామానికి చెందిన నాగోతి వెంకట్రావు పోతిన శ్రీను, వాండ్రాసి వెంకటి, పిల్లా అప్పలరాజు, వాండ్రాసి శ్రీను, ఆరో వార్డు అధ్యక్షులు గరే.గురునాథ్(కెవిఆర్), నోడగల జానకిరామ్, వాండ్రాసి అప్పల నాయుడు, రెడ్డి సత్య నారాయణ, నమ్మి రమణ, నాగోతి వెంకట సత్య నారాయణ కానూరి అచ్యుతరావు, నోడగల అప్పారావు, బోయి శ్రీనివాస్ రమాదేవి, సిహెచ్ సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో సుందరపు



**యలమంచిలి, పెన్ సత్తా, మే 30:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో తేదీన స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పిల్లా రమా కుమారి, పలువురు ప్రజా ప్రతినిధులు, వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు, ఎన్జీవో సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, సానిటరీ సిబ్బంది, ఎస్.హెచ్.జి సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ బి.జె.ఎస్.పి రాజు సమక్షంలో యలమంచిలి ఫైర్ ఆఫీస్ కాలనీ నుంచి శేషు గడ్డ, త్రిమూర్తులు గుడి వరకు అందరి సభ్యుల సహకారంతో చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాల పట్ల, పర్యావరణం పట్ల బాధ్యతగా ఉండాలని, చెత్తను రోడ్ల పై వేయకుండా తమ వంతు బాధ్యతగా మున్సిపల్ పారిశుద్ధ కార్మికునికి అందించాలని తెలియజేశారు.

అనంతరం మెయిన్ రోడ్డు కు ఇరువైపులా ఉన్న కాలువలో పూడికతీత పనులను పర్యవేక్షించి, వ్యాపారస్తులు శానిటేషన్ పూడిక తీత పనులకు అడ్డంకి లేకుండా కాలువల పై పలకలను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా వ్యాపారస్తులకు సూచించడం జరిగింది. అదే విధంగా మున్సిపల్ సిబ్బంది కాలువల పై అడ్డంకి లేకుండా ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ మేనేజర్ కే విజయ్ కుమార్, సిఎంఎం పద్మావతి, జనసేన నాయకులు పుటకూటి రమేష్, కొటారు శ్రీనివాస్, గుర్రం శేఖర్, నక్కా శివశంకర్, వాకర్స్ క్లబ్ నుండి పూరి జగన్నాథం మాస్టారు, పుర ప్రజలు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన అధికారులకు ఘన వీడ్కోలు.





**అనకాపల్లి, పెన్ సత్తా, మే 30:** పోలీసు శాఖలో దశాబ్దాల పాటు నిస్వార్థ సేవలు అందించి, క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణతో ఆదర్శంగా నిలిచిన ముగ్గురు అధికారులకు అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నాడు ఆత్మీయ వీడ్కోలు సభ అత్యంత వైభవంగా నిర్వహించారు. నేడు పదవీ విరమణ పొందిన బి.రామ్ కుమార్ (ఏఎస్ఐ, అనకాపల్లి టౌన్ పి.ఎస్), వి.త్రినాథ్ రావు (ఏఎస్ఐ, పరవాడ పి.ఎస్), ఎల్.గోవింద రావు (ఏఆర్ హెచ్.సీ) లను ఎస్పీ సత్కరించారు.
?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ తుహిన్ సిన్హా పదవీ విరమణ పొందిన అధికారులను, వారి కుటుంబ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వృత్తి ఎంతో ఒత్తిడితో కూడుకున్నది, అటువంటి బాధ్యతాయుత మైన రంగంలో 36 ఏళ్లు (త్రినాథ్ రావు, గోవిందరావు), 35 ఏళ్ల (రామ్ కుమార్) పాటు నిబద్ధతతో పనిచేయడం సామాన్య మైన విషయం కాదన్నారు. ఉమ్మడి జిల్లా లోని వివిధ పోలీస్ స్టేషన్లలో వీరు అందించిన సేవలు శాఖకు గర్వకారణం. విశ్రాంత జీవితం కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. విశ్రాంత జీవితంలో కూడా జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ సభలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన అధికారుల సుదీర్ఘ అనుభవాన్ని కొనియాడారు. శాఖలో ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుంటూ, నిరంతరం ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేసిన మీ సేవలు చిరస్మరణీయం అన్నారు. యువ పోలీసు అధికారులకు మీ క్రమశిక్షణే మార్గదర్శకం అని, ఈ సుదీర్ఘ ప్రయాణంలో మీకు వెన్నుముకగా నిలిచిన మీ కుటుంబ సభ్యులకు ప్రత్యేక అభినందనలు అని పేర్కొన్నారు. సత్కారం అందుకున్న అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తమ సుదీర్ఘ సర్వీసులో ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకుంటూ ఇన్నేళ్లపాటు తమ విధి నిర్వహణకు సహకరించిన పై అధికారులకు, తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖ కుటుంబం నుంచి విడిపోవడం బాధగా ఉన్నప్పటికీ, ఇంతటి ఘన వీడ్కోలు లభించడం ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీ.ఆర్.ఆర్.మోహన్, ఏ.ఓ. సి.హెచ్.తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు బాల సూర్యరావు, లక్ష్మి, రామకృష్ణా రావు, సీనియర్ అసిస్టెంట్ అప్పలరాజు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని రిటైర్డ్ అధికారులకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## విత్తన బంతులతో శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి.

- డ్రోన్ లతో చల్లేందుకు విత్తనాల గోళీలు తయారు చేయాలి.
- సంకల్ప కళా గ్రామం ఒక పర్యాటక ప్రదేశం.
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ.








**పెందుర్తి, పెన్ సత్తా, మే 30:**పర్యావరణ హితంగా జీవించుదాం అని ఎస్ ఒ ఎస్ విద్యార్థులకు గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు . శనివారం ఉదయం పెందుర్తి మండలం పెద్ద గాడి దగ్గర ఉన్న సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు నేతృత్వంలో భీమిలి ఎస్ ఒ ఎస్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ముందుగా డ్రోన్ లతో విత్తనాల గోళీలు జల్లించేందుకు విద్యార్థులతో ఆరు మిల్లీ మీటర్ల సైజ్ లో విత్తనాల గోళీలు, బంతులు తయారు చేయించారు. అనంతరం రత్నం మాట్లాడుతూ విత్తన గోళీలు, బంతులు తయారు చేసి, కొండల మీద, తీరంలో చల్లాలని, తద్వారా శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలని కోరారు. డ్రోన్ లతో చల్లేందుకు ఆరు మిల్లీ మీటర్ల పరిమాణం లో విత్తనాల గోళీలు తయారు చేయడం ఆనందంగా ఉంది అని పేర్కొన్నారు. సంకల్ప కళా గ్రామం ఒక పర్యాటక ప్రదేశం అని వివరించారు. ఈ గ్రామం మరింత విస్తృతంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల చలపతిరావు మాట్లాడుతూ ఎద్దు గానుగతో తయారు చేసిన నూనెలు ఆరోగ్యకరమైనవనిగా వివరించారు. అంతే కాకుండా తమ వద్ద కొయ్య బొమ్మలు, ప్రకృతి ఆధారంగా వేసిన రంగులతో నేసిన బట్టలు తయారు అవుతాయి అని వివరించారు. అలాగే ప్రకృతి ఆధారంగా పండించిన పంటలు లభ్యమవుతాయి అని అన్నారు.
సంస్థ ప్రతినిధి జమీలియా మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ప్రకృతితో మమేకమై జీవించాలని కోరారు. మనం ఆరగించిన పండ్ల విత్తనాలు దాచి విత్తనాల బంతులు, గోళీలు తయారు చేయడం అవసరం అని వివరించారు.
ఈ కార్యక్రమంలో ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, ఎస్ చెస్ భీమిలి ప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నప్రసాద భవనం వద్ద నూతన శౌచాలయం.








- క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి తక్షణ పరిష్కారం చూపిన ఈఓ జల్లేపల్లి.
- అన్నప్రసాదం వద్ద భక్తులతో ముచ్చటించి, భోజననాణ్యతను పరిశీలించిన ఇఓ.

**సింహాచలం, పెన్ సత్తా, మే 30:** సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ప్రత్యేక చొరవతో నిత్య అన్నప్రసాద భవనం సమీపంలో నూతనంగా నిర్మించిన శౌచాలయ సముదాయాన్ని శనివారం భక్తుల వినియోగం కోసం ప్రారంభించారు.
ఇటీవల నిత్య అన్నప్రసాద భవనాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ శౌచాలయ సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఈఓ గుర్తించారు. దీని పై వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన శౌచాలయ నిర్మాణం చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈఓ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ విభాగం అత్యంత వేగంగా పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటు లోకి తీసుకువచ్చింది.
ఈఓ అన్నప్రసాద భవనాన్ని సందర్శించి అక్కడ భోజనం చేస్తున్న భక్తులతో ముచ్చటించారు. దర్శన ఏర్పాట్లు, భోజన నాణ్యత, దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాల పై వారి అభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దేవస్థానం కల్పించిన సదుపాయాలు, అన్నప్రసాద నాణ్యత పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఈఓ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం భక్తులకు వడ్డిస్తున్న అన్నప్రసాదాన్ని పరిశీలించిన ఈఓ, బియ్యం, కూరగాయలు, సాంబారు, పెరుగు తదితర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. భక్తులకు ఎల్లప్పుడూ పరిశుభ్రమైన, నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాన్ని అందించాలని అన్నదాన విభాగం అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యాలు, సేవల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.
శనివారం సెలవు దినం కావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో ఈఓ కేశఖండనశాలను కూడా పరిశీలించారు. తీవ్ర ఎండలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు అందిస్తున్న మజ్జిగ, తాగునీటి సౌకర్యాలపై ఆరా తీసి, ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఆలయంలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తూ, వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. క్యూలైన్లలో భక్తులు ఇబ్బంది పడకుండా త్వరితగతిన దర్శనాలు పూర్తయ్యేలా అధికారులకు పలు సూచనలు జారీ చేసి, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు. భక్తుల అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా సింహాచలం దేవస్థానం భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఈఓ జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు.

## పక్కా ప్రణాళిక సరైన వ్యూహంతోనే విశాఖకు ఉజ్వల భవిష్యత్తు.






- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ శ్రీ భరత్.
- పలు ప్రజా సమస్యల పై సూచనలు చేసిన ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా, విష్ణుకుమార్ రాజు, వంశీ.
- అజెండా అంశాలతో పాటు, అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ అభిషిక్త్ కిశోర్.

**విశాఖపట్టణం, పెన్ సత్తా, మే 30:**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధి లోని అధికార యంత్రాంగం సమష్టి కృషి, సమన్వయంతో, సరైన వ్యూహం తోనే విశాఖకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎంపీ ఎం. శ్రీ భరత్ అన్నారు. నగరాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన తాగునీటి వ్యవస్థ, సమర్థవంత మైన మురుగునీటి నిర్వహణ, పర్యావరణ పరి రక్షణతో కూడిన ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాల్సి ఉందని ఉద్ఘాటించారు. తాగునీటి, మౌలిక వసతుల ప్రాజెక్టుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, తీరప్రాంత కాలుష్య నివారణ చర్యలు, అండర్ గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ, తాగునీటి ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతి పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శనివారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో ఆయన పలు అంశాల పై సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు.
సమావేశంలో భాగంగా ముందుగా ఆయన జీవీఎంసీకి అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.50 వేల కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద విశాఖపట్నానికి రూ.1,500 కోట్ల విలువైన మూడు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మంజూరవ్వటం సంతోషకరమని, ఈ అంశంలో జీవీఎంసీ పోషించిన పాత్ర అభినందనీయమని అన్నారు. ఈ క్రమంలో మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాల అమల్లో అధికార యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించాలని, ఫలాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జలధార-జలహారతి పనులు ద్వారా తాగునీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లు అందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉల్లాస్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో అక్షరాస్యత పెంచాలని, పీఎంఈజీపీ ద్వారా మరిన్ని యూనిట్లు నెలకొల్పాలని, నైపుణ్య శిక్షణలు అందించాలని, మెరుగైన ఉపాధి కల్పించాలన్నారు. నూతన లేబర్ కోడ్ లపై వాణిజ్య కార్యకాలాపాలు నిర్వహించే యాజమాన్యాలతో ప్రత్యేక అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా శిబిరాల్లో తనతో పాటు, జిల్లా కలెక్టర్ కూడా భాగస్వామ్యం అవుతామని పేర్కొన్నారు. గృహ సంబంధిత పథకాల అమల్లో పారదర్శకత పాటించాలని, అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలన్నారు. గ్రామీణ మండలాల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యవసాయ రంగ బలోపేతానికి కృషి చేయాలని, రైతులు పండించే పండలకు మంచి మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల అమలు విషయంలో అన్ని వర్గాల వారినీ దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. ముఖ్యంగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యాశాఖలో ఉత్తమ విధానాలు అమలు చేయాలని, కేజీబీవీలంటే విజయానికి చిరునామా అని.. అదే నమ్మకాన్ని నిలబెడుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఆ దిశగా అధికారులు పని చేయాలని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో అమృత్ 2.0లో చేపట్టే ప్రాజెక్టులను సత్వరమే ప్రారంభించాలని, సాంకేతిక అంశాలను పూర్తి చేసి ముందుకు సాగాలని పేర్కొన్నారు. విశాల మైన మైదానాలు, భవనాలు ఉన్న ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ పాఠశాలను గుర్తించాలని, వాటిని సద్వినియోగం చేసుకునే దిశగా నివేదికలు సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.
చికెన్ మటన్ నాణ్యతను తనిఖీ చేసి గ్రేడింగ్ ఇవ్వాలి. నగర పరిధిలో క్రయ విక్రయాలు జరిగే చికెన్, మటన్ నాణ్యత పై అధికారుల దృష్టి సారించాలని ఎంపీ చెప్పారు. ప్రత్యేక బృందాలను నియమించి తనిఖీలు చేయించాలని, అక్కడ పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాల ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వాలని సూచించారు. తగిన మోతాదులో శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించాలని చెప్పారు. ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం లేకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.
ప్రధాన అంశాల పై దృష్టి సారించి ఆశాజనక ఫలితాలు సాధించాలి జిల్లా కలెక్టర్. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ సూచించారు. ప్రధాన అంశాల పై దృష్టి సారించి, ఆశాజనక రీతిలో ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలని, సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో భాగంగా ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్ణీత సమయంలో తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.
అచ్చెన్నాయుడు లోవ ప్రత్యేక వసతులు కల్పించాలి విప్ గణబాబు.
అచ్చెన్నాయుడు లోవ వద్ద టిడ్కో ఇళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, త్వరలోనే ఇక్కడొక కొత్త నివాస సముదాయం అందుబాటు లోకి వస్తుందని, కావున అధికారులు స్పందించి ముందుగానే కనీస మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. ప్రజల అవసరార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. యూజీడీ, 24 గంటల పాలు స్వచ్ఛమైన తాగునీరు అందించే విషయంలో జీవీఎంసీ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉందని పేర్కొన్నారు. భూగర్భ విద్యుత్ కేబుల్ ఏర్పాటు పనులు జరిగే క్రమంలో గుంతలను వేగండా పూడ్చటం లేదని, దానివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. పనులు అయిన వెంటనే గుంతలను పూడ్చాలని సూచించారు.
టిడ్కో,రాజీవ్ గృహ కల్పలో ఖాళీ ఇళ్లను అర్హులకు పునః కేటాయించాలి ఎమ్మెల్యే పల్లా. ఈ అంశం పై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాజా స్థితి పై పరిశీలించి నివేదిక అందించాలని, సాంకేతిక అంశాలను పరిశీలించాలని అక్కడే ఉన్న హౌసింగ్, యూసీడీ అధికారులను ఆదేశించారు.
డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు అప్పగించాలి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు. టిడ్కో ఇళ్ల కోసం డీడీల రూపంలో నగదు చెల్లించి, బ్యాంకు రుణాల ఈఎంఐలు కూడా చెల్లిస్తున్న లబ్ధిదారులకు ఇప్పటికీ ఇళ్లు అందకపోవడం బాధాకరమని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె భారం, రుణాల వాయిదాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. డీడీలు చెల్లించిన అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లను కేటాయించి, పెండింగ్ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను కోరారు. టిడ్కో ఇళ్ల పంపిణీపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, లబ్ధిదారులకు న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళా సాధికారత కల్పనలో బ్రాండిక్స్ భేష్.





కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్.

**అచ్యుతాపురం, పెన్ సత్తా, మే 30:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్త్ర పరిశ్రమ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు.

శనివారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ (సెజ్) లోని ప్రముఖ అంతర్జాతీయ వస్త్ర తయారీ సంస్థ 'బ్రాండిక్స్' ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థలో జరుగుతున్న వస్త్ర ఉత్పత్తుల తయారీ, అంతర్జాతీయ ఎగుమతులు, దిగుమతుల ప్రక్రియను బ్రాండిక్స్ ఇండియా డైరెక్టర్, భారతీయ భాగస్వామి దొరస్వామి మంత్రికి క్షుణ్ణంగా వివరించారు. ఫ్యాక్టరీ అంతటా పర్యటించి కార్మికుల పనితీరును, వారికి కల్పిస్తున్న వసతులను పరిశీలించిన కేంద్రమంత్రి, యాజమాన్యం తీసుకుంటున్న శ్రద్ధను ప్రత్యేకంగా అభినందించారు. కోటి పెట్టుబడికి 50 మందికి ఉపాధి. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఏకైక రంగం టెక్స్‌టైల్స్ (జౌళి) మాత్రమేనని మంత్రి గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. గార్మెంట్ రంగానికి ఉన్న ఉపాధి సామర్థ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టే ప్రతి రూ. 1 కోటి పెట్టుబడికి సుమారు 50 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందని ఆయన వెల్లడించారు. బ్రాండిక్స్ వంటి భారీ పరిశ్రమల ఏర్పాటు వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు వేల సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తూ ఆర్థికంగా స్థిరపడుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. బ్రాండిక్స్ రాకతో ఈ ప్రాంతంలో మహిళా సాధికారత గణనీయంగా పెరిగిందని స్థానికులు తనకు స్వయంగా తెలిపారన్నారు. ఇంట్లో ఒక మహిళ ఆర్థికంగా బలోపేతమైతే ఆ కుటుంబమంతా వృద్ధి చెందుతుందన్నదే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో సరికొత్త విప్లవం. భవిష్యత్తు అంతా సాంకేతిక వస్త్రాల దేనని కేంద్ర మంత్రి చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన సమావేశంలో ఈ రంగం అభివృద్ధి పై తాము సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం సాధారణ దుస్తులతో పాటు ఏరోస్పేస్, డ్రోన్లు, రక్షణ, వైద్య, వ్యవసాయ రంగాలలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ వినియోగం విపరీతంగా పెరుగుతోందని వివరించారు. ఈ సరికొత్త విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, బ్రాండిక్స్ తరహాలో మరిన్ని పరిశ్రమలు ఇక్కడికి వస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి బలమైన ఊతం లభిస్తుందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జౌళిశాఖ ఉన్నతాధికారులు, బ్రాండిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# దొడ్డి శ్రీనివాసరావు ను పరామర్శించిన కొణతాల





**మునగపాక, పెన్ సత్తా, మే 30:** మాజీ మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు ను అనకాపల్లి మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పరామర్శించారు. దొడ్డి శ్రీనివాసరావు తల్లి ఇటీవల మరణించారు. ఆమె మరణానికి గల కారణాలు తెలుసుకొని ఆమె మృతికి సంతాపం తెలియజేసిన ఎమ్మెల్యే. కొణతాల వెంట మాజీ సర్పంచ్ ఎల్లప్ప భాస్కరరావు, గన్రెడ్డి సూరిబాబు, టిడిపి నాయకులు ఆడారి జనార్ధన్, కాండ్రేగుల నాగేంద్ర, పలమరశెట్టి మురళి, పెదకం చెట్టి రాజు, పలమరశెట్టి నూకాలయ్య, పోలమరశెట్టి నాగు, జనసేన ఆడారి గణేష్, మొల్లేటి ఆనంద్, సాలాపు మురళి, దోబాసి నాయుడు తదితర కూటమి నాయకులు దొడ్డి జగ్గయ్యమ్మకు సంతాపం తెలియజేశారు.

# నాలుగు రోజులుగా తాగునీటి కష్టాలు.. ట్యాంకర్లతో నీటి సరఫరా

- మర్సుకుంట గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు అందని ద్రాక్షగా మారిన పరిస్థితి
- ప్రజల ఇబ్బందులను తాత్కాలికంగా తీర్చేందుకు పంచాయతీ చర్యలు



**పెన్ సత్తా, మే 30:** ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల పరిధిలోని సూర్య తండా గ్రామపంచాయతీకి చెందిన మర్సుకుంట గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గత నాలుగు రోజులుగా గ్రామంలోని ఇళ్లకు నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా నీటి సరఫరా చేపడుతున్నారు.

గ్రామంలో ఇంటి అవసరాలకు, తాగునీటికి, పశువుల అవసరాలకు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, అది గ్రామ ప్రజల అవసరాలకు పూర్తిస్థాయిలో సరిపోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

గ్రామ ప్రజల ప్రకారం, మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా మొదటి నుంచే సక్రమంగా అందడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాలకు శుద్ధమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథను అమలు చేసినప్పటికీ, మరుసుకుంట గ్రామంలో మాత్రం ఆ లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు చెబుతున్నారు.

ప్రస్తుతం గ్రామంలో విద్యుత్ మోటార్ల సహాయంతో నీటి సరఫరా నిర్వహిస్తున్నారు. అయితే తరచూ కరెంటు కోతలు ఏర్పడటం, సాంకేతిక లోపాలు తలెత్తడం, మోటార్లు సరిగా పనిచేయకపోవడం వంటి కారణాలతో నీటి సరఫరా అంతరాయం కలుగుతోంది. ఫలితంగా ప్రజలు నీటి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.వేసవి తీవ్రత ఇంకా పూర్తిగా తగ్గని నేపథ్యంలో తాగునీటి సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, మిషన్ భగీరథ ద్వారా నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యకు గల కారణాలను గుర్తించి, మర్సుకుంట గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న సరఫరా తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వత పరిష్కారం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ వేణుగోపాల్.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, మే 30:** జూన్ 5 నుండి 12, 2026 వరకు నిర్వహించనున్న పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఐ డి ఓ సి కార్యాలయం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 5వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,399 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, వారి కోసం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం నాలుగు మంది చీఫ్ సూపరింటెండెంట్లు, నాలుగు మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు . విద్యార్థులు పరీక్షలకు ముందురోజే తమ పరీక్షా కేంద్రాలను తెలుసుకోవాలని , పరీక్ష జరిగే రోజు కనీసం గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో విద్యుత్ సరఫరా, రవాణా, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సదుపాయాల విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, వైద్యశాఖ ప్రతినిధి డా. టి. ప్రతాప్, విద్యుత్ శాఖ డీఈ పి.ఎస్.వి.ఎస్. నందయ్య, ఇల్లందు మున్సిపాలిటీ ప్రతినిధి డి. శ్రీనివాస్, ఆర్టీసీ ప్రతినిధి కె. మోహన్‌రావు, డీపీఓ కార్యాలయ ప్రతినిధి ఎస్. శ్రీనివాస్, పోస్టల్ శాఖ ప్రతినిధి ఎం.డి. అలీం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధి ఎం. అశోక్, పోలీసు శాఖ ప్రతినిధి పి.డి. క్రిస్టఫర్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ (పరీక్షలు) ఎస్. మాధవరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచుల ఫోరం మండల కమిటీ ఎన్నిక

**సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులుగా కటికం వేణు**



**గరిడేపల్లి పెన్ సత్తా, మే 30:** భారీ నీటిపారుదల అండ్ సివిల్ సప్లై శాఖ మంత్రివర్యులు అయినటువంటి టైగర్ ఉత్తంకుమార్ రెడ్డి ఆశీస్సులతో సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్ అధ్యక్షతన జరిగిన గరిడపల్లి మండల సర్పంచ్లుల ఫోరం అధ్యక్షుని ఎన్నుకోవడం జరిగింది దీనికి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా కటకం వేణు పొనుగోడు సర్పంచ్ ఉపాధ్యక్షులుగా అరుణ రమేష్ ప్రధాన కార్యదర్శిగా కీసర వెంకటరమణ బుచ్చయ్య వీరు తోపాటు పాత కార్యవర్గాన్ని కొనసాగించడమైనది ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు త్రిపుర అంజన్ రెడ్డి మాజీ ఎంపీపీ కటికం ఆశా రమేష్ మాజీ ఎంపీపీ రంగనాథ్ మరియు వివిధ గ్రామ శాఖ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు పరమేశ్ సందీప్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు

# అమ్మ ఒడి. బి అంగన్వాడి

**అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ**




**గరిడేపల్లి పెన్ సత్తా, మే 30:** అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలను చేర్పించండి.పోషక ఆహార లోపం లేకుండా చూసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను ప్రత్యేక దృష్టితో చూస్తూ, అంగన్వాడీల బలోపేతానికి అధిక నిధులను కేటాయిస్తున్నందున, సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై వున్నదని అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ అన్నారు

గరిడేపల్లి మండలం లోని గానుగబండ గ్రామం లో ఈ రోజు అంగన్వాడీల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించినారుఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలలో పిల్లలను చేర్పించడం ద్వారా అనేక రకాల ప్రయోజనం పిల్లలకు కలుగుతుందని,అంగన్వాడీ ల ద్వారా ప్రతి రోజు పిల్లలకు పౌష్టిక ఆహారం ఇస్తారని, పౌష్టికహారం తీసుకోవడం ద్వారా పిల్లలలో పోషకాహారం లోపం లేకుండా చూసుకోవచ్చునని, నర్సరీ విద్యను కూడా అందిస్తున్నందున అర్హులైన పిల్లలను అందరిని అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని ఆమె తల్లి తండ్రులను కోరారుఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్స్ పోకల వెంకమ్మ, అమరారపు సత్యవతి, జంగం అనిత,పిల్లల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు.

**సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బత్తిని శ్రీకాంత్ గౌడ్**




**గరేడేపల్లి పెన్ సత్తా, మే 30:** సూర్యాపేట జిల్లా ఎస్పీ శ్రీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్ సిబ్బంది ఈరోజు శనివారం గరిడేపల్లి మండల కేంద్రశీలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలణ గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలోని హోటల్స్, టీ దుకాణాలు, మెడికల్ దుకాణాలు, పాఠశాలలకు దగ్గర గల పాన్ షాపులు మరియు ఇతర దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామని అన్నారు. ప్రస్తుత సమాజంలో గంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని, సమాజాన్ని పట్టిపీడిస్తుందని, దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి మరియు మంచి భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాల విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ లకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు.

ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజ నిర్మాణమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బంది, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజస్థాన్‌లో ఇసుక తుపాన్ బీభత్సం

రాజస్థాన్‌లో ఇసుక తుపాను బీభత్సం సృష్టించింది. చురు, బికనేర్ ప్రాంతాలను ఇసుక తుపాను అతలాకుతలం చేసింది. సునామీ తరహాలో భారీ ఈదురు గాలులతో నివాస ప్రాంతాలను ఇసుక ముంచెత్తింది. ఇసుక తుపానుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తుపాను ధాటికి పట్టపగలే చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఇసుక తుపాను అనంతరం కొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది.

**పట్టపగలే కమ్ముకున్న చీకట్లు**

రాజస్థాన్‌లోని చురు, బికనేర్ ప్రాంతాల్లో వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. ఆకాశాన్ని భారీ ధూళి మేఘాలు కమ్మేయడంతో పట్టపగలే రాత్రిని తలపించింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భయంకరమైన ఇసుక తుపాను విరుచుకుపడింది. సుడిగాలిలా చెలరేగిన భారీ ధూళి మేఘాలు ఆకాశాన్ని పూర్తిగా కప్పేశాయి. విపరీతమైన వేగంతో గాలులు వీయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లపై కొద్ది మీటర్ల దూరం కూడా కనిపించని పరిస్థితి నెలకొనడంతో వాహనాలు హెడ్‌లైట్ల సాయంతో మెల్లగా కదిలాయి.

**భారీ వర్షం**

ఇసుక తుపానుకు స్థానిక మార్కెట్లలో గందరగోళం నెలకొంది. బలమైన గాలులు, ఇసుక తుపాన్ నుంచి రక్షించుకునేందుకు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ఈ భీకర గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు, కరెంటు స్తంభాలు దెబ్బతిన్నాయి. ఇసుక తుపాను అనంతరం కొన్నిచోట్ల భారీ వడగళ్ల వర్షం కురిసింది. దట్టమైన ఇసుక తుఫాను, భారీ వర్షం కారణంగా స్థానికుల రోజువారీ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సర్దార్‌షహర్ ప్రాంతంలో ధూళి మేఘాల తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఆకాశాన్ని ఇసుక మేఘాలు పూర్తిగా కమ్మేయడంతో, పట్టపగలే దట్టమైన చీకట్లు అలుముకున్న దృశ్యాలు చూపరులను భయాందోళనలకు గురిచేశాయి.

**మరో 4-5 రోజులపాటు ఇదే పరిస్థితి**

వెస్టర్న్ డిస్టబెన్స్ వల్ల రాజస్థాన్‌లో మరో 4,5 రోజులపాటు ఇదే విధంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. అదే సమయంలో ఇసుక తుపానులు కూడా కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా



ఉండాలని, అనవసర ప్రయాణాలు వద్దని శనివారం సూచించింది.

వాస్తవానికి గడచిన 24 గంటల్లో రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులతో కూడిన తుపానులు, వర్షాలు సంభవించాయి. కాగా ధోల్‌పూర్ జిల్లాలోని బారి ప్రాంతంలో అత్యధికంగా 58 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జైపూర్‌లోని వాతావరణ కేంద్రం సమాచారం ప్రకారం, బికనీర్, జైపూర్, అజ్మీర్, భరత్‌పూర్, కోట, జోధ్‌పూర్, ఉదయ్?పూర్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఈ రోజు గంటకు 60 నుంచి 70 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తర వర్షాలు పడే ఛాన్స్ ఉందని పేర్కొంది. ఇంకొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వానలతోపాటు పిడుగులు పడే అవకాశముందని హెచ్చరించింది. రాష్ట్రంలో ఇలాంటి వాతావరణ పరిస్థితులు మరో నాలుగైదు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని, కనుక ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా, చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, ఇది తీవ్ర వేడిమి, వడగాల్పుల నుంచి ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

**ఇంతకీ వెస్టర్న్ డిస్టర్బెన్స్ అంటే ఏమిటి?**

వెస్టర్న్ డిస్టర్బెన్స్ అనేది మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఏర్పడి, భూమికి అత్యంత ఎత్తులో వీచే జెట్ స్ట్రీమ్స్ అనే బలమైన పశ్చిమ గాలుల ద్వారా భారత ఉపఖండం వైపు కొట్టుకువచ్చే ఒక అల్పపీడన వ్యవస్థ. పశ్చిమ దిశ నుంచి ప్రయాణిస్తూ కాస్పియన్, అట్లాంటిక్ మహాసముద్రాల నుంచి తేమను గ్రహించే ఈ తుపాను వ్యవస్థ, హిమాలయ పర్వతాలను ఢీకొన్నప్పుడు జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్ వంటి ఉత్తర పర్వత ప్రాంతాలలో భారీ హిమపాతాన్ని, అలాగే పంజాబ్, హరియాణా, రాజస్థాన్, దిల్లీ వంటి మైదాన ప్రాంతాలలో అకాల వర్షాలు, ఈదురు గాలులు, ఇసుక తుపానులను తీసుకువస్తుంది. శీతాకాలంలో కురిసే ఈ వర్షాలు భారతదేశంలో రబీ పంటలకు (ముఖ్యంగా గోధుమలకు) ఎంతో మేలు చేకూరుస్తాయి. కానీ ఎండాకాలంలో దీని వల్ల తీవ్రమైన దుమ్ము తుపానులు, వడగళ్ల వానలు పడతాయి. దీని చాలా వరకు ఆస్తి నష్టాన్ని, కొన్నిసార్లు ప్రాణనష్టానికి కారణమవుతుంటాయి.

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్

కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ సీఎం సిద్ధరామయ్య డీకే పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా సమర్థించారు. దీంతో కర్ణాటక కాంగ్రెస్ సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐసీసీ పరిశీలకులు ప్రకటించారు. అయితే కేవలం పది నిమిషాల్లోనే సీఎల్పీ భేటీ ముగియడం గమనార్హం.

**జూన్ 3న ప్రమాణ స్వీకారం**

కర్ణాటక కొత్త ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమాణస్వీకారోత్సవం జూన్ 3న జరగనుంది. ఈ విషయాన్ని కర్ణాటక కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జీసీ చంద్రశేఖర్ ప్రకటించారు. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారోత్సవం లోక్‌భవన్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిరాడంబరంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే సీఎం ప్రమాణస్వీకారోత్సవ వేదికను లోక్‌భవన్‌కు మార్చినట్లు చంద్రశేఖర్ చెప్పారు. ట్రాఫిక్ రద్దీ తలెత్తకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ఎవరు కూడా లోక్‌భవన్‌కు రావద్దన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ సహకరించాలని చంద్రశేఖర్ కోరారు.

**గవర్నర్‌తో డీకే భేటీ**

కాగా, డీకే శివకుమార్ ఈ రోజు ఉదయం? లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్‌తో భేటీ అయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపైనే వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఎందుకంటే, గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ ఆదివారం ధర్మస్థలలో జరిగే ఉపరాష్ట్రపతి పర్యటనకు హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం ఆయన ఈ రోజే బెంగళూరు వెళ్తున్నారు. గవర్నర్



అందుబాటులో ఉండరనే ఉద్దేశంతోనే, సీఎల్పీ సమావేశానికి ముందే డీకే ఆయనతో భేటీ అయినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**మంత్రివర్గంలో సిద్ధరామయ్య కొడుకు?**

శివకుమార్? సీఎం అయ్యాక, కొత్త మంత్రి వర్గంలో సిద్ధరామయ్య కుమారుడికి చోటు దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఎందకంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం దిల్లీ వెళ్లిన సిద్ధరామయ్య, కొత్త క్యాబినెట్‌లో తన తరఫున మంత్రుల జాబితాను పార్టీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పరిశీలన కోసం అందించారు. అందులోనూ తన కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్రకు ఉపముఖ్యమంత్రి పదవితోపాటు, కీలక శాఖలు కేటాయించాలని ప్రత్యేకంగా కోరినట్లు తెలుస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రుల్లో దాదాపు సగం మందికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కకపోవచ్చని సమాచారం.

**సీఎం మార్పు వల్ల నో యూజ్**

కర్ణాటక కాంగ్రెస్? సర్కార్?పై బీజేపీ ఎంపీ, మాజీ సీఎం బసవరాజ్? బొమ్మై శనివారం విమర్శల వర్షం కురిపించారు. కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయడం వల్ల సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో అర్థవంతమైన మార్పు వచ్చే అవకాశమే లేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కర్ణాటక భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. సరైన పాలన లేకపోవడం, అభివృద్ధి శూన్యం కావడం వల్ల ప్రజల్లో, ముఖ్యంగా ఓబీసీ సామాజిక వర్గంలో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. వారి అసంతృప్తి భవిష్యత్ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుందని జోస్యం చెప్పారు. "ప్రస్తుతం రాష్ట్రం భారీ రుణాల భారంతో కొట్టుమిట్టాడుతోంది. సుపరిపాలన, అభివృద్ధి లేక ప్రజల్లో నైరాశ్యం అలముకుంది. ప్రజలు, ప్రత్యేకించి ఓబీసీ వర్గం నిరంతరం నిరాశకు గురవుతున్నారు. అది ప్రభావం వచ్చే ఎన్నికల్లో కనిపిస్తుంది" అని బొమ్మై హెచ్చరించారు. సిద్ధరామయ్య మే 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత, కర్ణాటక కాంగ్రెస్?లో నాయకత్వ మార్పు, సంస్థాగత పునర్వ్యవస్థీకరణ జరుగుతున్న తరుణంలో బొమ్మై ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

కాగా, సిద్ధరామయ్య రాజీనామాను గవర్నర్ థావర్?చంద్ గెహ్లోత్? ఆమోదించడంతో పాటు మంత్రిమండలిని కూడా రద్దు చేశారు. అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తయ్యే వరకు సిద్ధరామయ్యను ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారు. కాగా ఈ రోజు సాయంత్రం జరగనున్న సీఎల్?పీ సమావేశంలో డీకే శివకుమార్?ను లాంఛనగా ముఖ్యమంత్రిగా ఎన్నుకునే అవకాశం కనిపిస్తోంది. ఇది కాస్త సజావుగా సాగితే, ఆ తర్వాత రాజ్యసభ నామినేషన్లు, ఎమ్మెల్సీ పదవులతో సహా కీలక నియామకాలను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

# "విశ్వగురువు అని ప్రగల్బాలు పలకడమే

దేశ విద్యావ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ పూర్తిగా నాశనం చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం తీవ్ర విమర్శలు చేశారు. ఒకవైపు దేశాన్ని విశ్వగురువుగా చెప్పుకుంటున్న మోదీ సర్కార్, కనీసం ఒక్క పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేకపోతోందని ఆయన ఆరోపించారు.

అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం భారతదేశ వ్యాప్తంగా 'సీయూఈటీ-యూజీ 2026 పరీక్ష' నిర్వహించారు. అయితే సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొన్ని కేంద్రాల్లో పరీక్ష ఆలస్యమైందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్?టీఏ) ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ, ప్రధాని మోదీని ఉద్దేశించి ఎక్స్ వేదికగా ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. చార పరీక్షాఏం। ఏక కరోడ? బచ్చే। ఏక భీ ఈమానదారీ సే నహీం హో పాఈ।

దావే " విశ్వగురు" కే, మగర దేశ మేం ఏక పరీక్షా నహీం కరవా సకతే - మోదీ జీ నే పూరీ శిక్షా వ్యవస్థా తబాహ కర దీ హై।

జిస పీఢ?ాకా భవిష్య ఆప బర్బాద కర రహే హైం - వహీ పీఢ?ా ఆపకా హిసాబ కరేగీ।ద="" జూగ--- తీుఖ్రపుబశ్రీ స్త్రుఅస్త్రఱ (ఏతీుఖ్రపుబశ్రీస్త్రుఅస్త్రఱ) మీుఎ 30, 2026

"నీట్?, సీబీఎస్?ఈ, ఎస్?ఎస్?సీ, నేడు సీయూఈటీ. మొత్తం నాలుగు పరీక్షలు, ఒక కోటి మంది విద్యార్థులు. ఒక్క పరీక్షను కూడా నిజాయితీగా నిర్వహించలేకపోయారు. తాము విశ్వగురువు అని ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ దేశంలో కనీసం ఒక్క పరీక్షను కూడా నిర్వహించే సామర్థ్యం లేదు. మోదీజీ మొత్తం విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేశారు. అయితే మీరు ఏ తరం భవిష్యత్తునైతే పాడు చేశారో, అదే తరం మిమ్మల్ని నిలదీస్తుంది. జవాబుదారీలను చేస్తుంది."

ఇంతకు ముందు కూడా రాహుల్ గాంధీ, ప్రధాని మోదీని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్?లపై తీవ్ర విమర్శలు చేశారు. సీబీఎస్?ఈ వివాదంపై పీఎం మోదీ మౌనం వహించడం, విద్యాశాఖమంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే, ఆయనకు కేవలం తన ప్రభుత్వ మనుగడపైనే శ్రద్ధ ఉందని, లక్షలాది మంది విద్యార్థులు భవిష్యత్తుపై లేదని రాహుల్ విమర్శించారు. అంతేకాదు నీట్? పేపర్? లీక్?పై ఆందోళన చేపట్టిన విద్యార్థులతో, తాను జరిపిన సంభాషణకు సంబంధించిన ఒక వీడియోను కూడా రాహుల్? ఎక్స్?లో పోస్టు చేశారు. దేశానికి ఒక చదువుకున్న ప్రధానమంత్రి కావాలి: కేజ్రీవాల్?

మరోవైపు నీట్? పేపర్ లీక్ కావడంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్?) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ శనివారం కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దేశ విద్యావ్యవస్థ మాఫియా గుప్పిట్లోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. నీట్ పరీక్ష పత్రాలను పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లేందుకు ఇండియన్ ఎయిర్? ఫోర్స్? సహాయం తీసుకోనున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్? పేపర్ లీక్?కు కారణాలు తెలుసుకునే ఉద్దేశం కేంద్రానికి లేదని, దానికి బదులుగా ఇలాంటి వింతైన పనులకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఎక్స్ వేదికగా హిందీలో ఓ పోస్టు పెట్టిన కేజ్రీవాల్, మోదీ సర్కార్?పై సెటైర్లు వేశారు. "నీట్? పరీక్ష పేపర్? లీక్ కాకుండా అడ్డుకోవడానికి ఎయిర్? ఫోర్స్‌ను ఉపయోగిస్తారట. దీని వల్ల పేపర్ లీక్?లు ఆగిపోతాయా? మన ప్రభుత్వం చదువుకోని వారిలా ఎలా మాట్లాడుతోంది? ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరీక్షలు జరుగుతుంటాయి. ఎక్కడైనా ఇలాంటి వింత గురించి విన్నామా? వాస్తవానికి వాళ్లకు పేపర్ లీక్ ఆపాలనే ఉద్దేశం లేదు. దేశ విద్యావ్యవస్థ పూర్తిగా మాఫియా చేతుల్లోకి వెళ్లిపోయింది." అయితే దీనిని సరిదిద్దడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి ఏదో ఒకటి చేయాలని కేజ్రీవాల్? పిలుపునిచ్చారు. ఒక్కరుగా ఎవరూ ఏమీ చేయలేరని, అందరూ కలిస్తే ఏదైనా సాధ్యమేనని ఆయన అన్నారు. అదే సమయంలో దేశానికి చదువుకున్న ప్రధానమంత్రి అవసరం ఎంతైనా ఉందని, మోదీపై తనదైన స్టైల్?లో సెటైర్ వేశారు. కాగా, ఇంతకు ముందు నీట్-యూజీ పేపర్ లీకేజీ వ్యవహారంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్ష నిర్వహణను పర్యవేక్షించేందుకు కమిటీ ఉన్నా నీట్? పేపర్ ఎలా లీకైందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

## ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాలో ఎస్ఐఆర్ ఒకటి

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న వేళ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాల్లో ఒకటని అభిప్రాయపడ్డారు. రేయింబవళ్లు ప్రతికూల ఒత్తిళ్లు ఎదురవుతున్నప్పటికీ పూర్తి పారదర్శకతతో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నందుకు ఎన్నికల అధికారులను ప్రశంసించారు. దిల్లీలో జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న జ్ఞానేశ్ కుమార్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

"15 లక్షలకు పైగా బూత్ స్థాయి ఏజెంట్లు, అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల జిల్లా, రాష్ట్ర అధ్యక్షుల పర్యవేక్షణలో 11 లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు ఈ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రూపొందిస్తున్నారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్నవారందరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు. వారందరూ ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాల్లో ఒక దానిని తయారుచేయడానికి ఎన్నికల సంఘానికి డిప్యూటేషన్‌పై ఉన్నారు. సీఈసీతో కలిసి పనిచేస్తున్న దేశంలోని ప్రముఖ న్యాయవాదులందరికీ, అలాగే 11 లక్షల బూత్ స్థాయి అధికారులు, 15 లక్షల బూత్ స్థాయి ఏజెంట్లకు వందనాలు" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు.

## 'ఆపరేషన్ సింధూర్ 2.0'కు భారత్ సన్నద్ధం

భారత సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం (మే 30) సంచలన వ్యాఖ్యలు చేశారు. శత్రు దేశాల కుతంత్రాలను తిప్పికొట్టేందుకు, దేశ రక్షణే ధ్యేయంగా భారత్ 'ఆపరేషన్ సింధూర్ 2.0'కు సన్నద్ధమవుతోందని ఆయన స్పష్టం చేశారు. కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ చర్యలకు ప్రతిస్పందనగా భారత్ అవలంబించిన కఠిన సైనిక వైఖరి ఇంకా కొనసాగుతూనే ఉందని ఆయన తెలిపారు. మీడియా సంస్థ 'ఏఎన్ఐ'తో మాట్లాడిన జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆపరేషన్ సింధూర్ ఇంకా కొనసాగుతోంది అని స్పష్టం చేశారు. ప్రస్తుత సరిహద్దు పరిస్థితిని ఆయన తాత్కాలిక ఘర్షణల విరమణగా అభివర్ణించారు. పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే శత్రుదేశానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఒకవేళ భవిష్యత్తులో కొత్త ఆపరేషన్ చేపట్టాల్సి వస్తే, కేవలం ఆర్మీ మాత్రమే కాకుండా ఎయిర్ ఫోర్స్, నావికా దళాలు సైతం ఉమ్మడిగా దాడికి సిద్ధంగా ఉన్నాయని ఆయన వివరించారు. తదుపరి యుద్ధం కోసం త్రివిధ దళాలు 24గంటలు సన్నద్ధతతో ఉన్నాయని, వాటి మధ్య సమన్వయాన్ని మరింత పెంపొందిస్తున్నామని తెలిపారు. ఆధునిక యుద్ధ తంత్రం గురించి మాట్లాడుతూ.. "ప్రస్తుత రోజుల్లో యుద్ధభూమి చాలా పారదర్శకంగా మారింది, మన ప్రతి కదలిక అవతలి వారికి తెలిసిపోతుంది. అందువల్ల సరిహద్దు ప్రాంతాల్లో మన సైనికులను, పౌరులను రక్షించడానికి అవసరమైన వ్యూహాత్మక రక్షణ, సైన్య మోహరింపు విషయంలో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి" అని ఆర్మీ చీఫ్ పేర్కొన్నారు.

అంతేకాకుండా, కేవలం సరిహద్దుల్లోనే కాకుండా సమాచార యుద్ధంలో గెలవడం కూడా అంతే ముఖ్యమని ఆయన అన్నారు. దేశం మొత్తం ఏకమై, అధికారిక సమాచారాన్ని విశ్వసించినప్పుడే సమాచార యుద్ధంలో విజయం సాధించగలమని, అలాంటి ఐక్యత ఉన్న దేశం ఎల్లప్పుడూ యుద్ధంలో గెలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**అసలేమిటి ఈ ఆపరేషన్ సింధూర్?**

గత ఏడాది, అంటే 2025 మే 7 -- మే 8 మధ్య రాత్రి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి బలమైన ప్రతీకారంగా భారతదేశం 'ఆపరేషన్ సింధూర్'ను ప్రారంభించింది. అంతకుముందు ఏప్రిల్ 22న కాశ్మీర్‌లోని పహల్గామ్, బైసారన్ లోయలో పాకిస్థాన్ మద్దతు గల ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఆ ఉగ్రదాడికి గట్టి బుద్ధి చెప్పడానికే భారత సైన్యం ఈ ఆపరేషన్ చేపట్టింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా పార్ట్-2 ఆపరేషన్ సింధూర్ 2.0కు కూడా త్రివిధ దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో భారీ రద్దీ

ఉత్తరాఖండ్‌లో ఉన్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన కేదార్‌నాథ్‌కు భక్తులు పోటెత్తుతున్నారు. బాబా కేదార్‌నాథ్‌ను చూసేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. దీంతో కేదార్‌నాథ్ ధామ్‌కు వెళ్లే 19 కిలోమీటర్ల పొడవైన కాలినడక (ట్రెక్కింగ్) మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ కాలినడక మార్గంలో నెలకొన్న రద్దీకి సంబంధించిన అనేక వీడియోలు వెలుగులోకి వచ్చాయి. ఇవి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కేదార్‌నాథ్ ధామ్ ట్రెక్కింగ్ మార్గంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు తీర్థయాత్ర నిర్వహణ, భక్తుల భద్రతకు సంబంధించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఈ నడక మార్గంలోని భీంబలి, లించోలి, జంగల్‌చట్టి వంటి కీలక ప్రాంతాల్లో దారి అత్యంత ఇరుకుగా ఉండటం వల్ల భక్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఓవైపు వేలాది మంది భక్తులు బాబా కేదార్‌నాథ్ ఆశీస్సుల కోసం కాలినడకన ఈ కఠినమైన యాత్రను సాగిస్తున్నారు. మరోవైపు గుర్రాలు, డోలీలు (పల్లకీలు), స్థానిక సేవా ప్రదాతల రాకపోకలు వివిధ ప్రదేశాలలో రద్దీని మరింత పెంచుతున్నాయి. ఫలితంగా భక్తులు గంటల తరబడి రద్దీలో చిక్కుకుని, ముందుకు సాగడానికి దారి క్లియర్ అయ్యేంత వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, తుంగనాథ్ ధామ్ వద్ద భక్తుల మధ్య జరిగిన ఘర్షణలకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. దీంతో పరిపాలనాపరమైన ఏర్పాట్ల సమర్థతపై తీవ్రమైన చర్చ మొదలైంది. కేథార్‌నాథ్ ధామ్ కాలినడక మార్గంలో రద్దీకి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోల్లో భారీ సంఖ్యలో భక్తులు ఒకరి వెనుక ఒకరు అతి దగ్గరగా నిలబడి పొడవైన క్యూలలో వేచి ఉండటం స్పష్టంగా కనిపిస్తోంది. భీంబలి, లించోలి ప్రాంతాల్లో పరిస్థితి మరీ క్లిష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ దారి ఇరుకుగా ఉండటం వల్ల రాకపోకలకు తరచుగా అంతరాయాలు కలుగుతున్నాయి. వృద్ధ భక్తులు, మహిళలు, చిన్న పిల్లలతో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**భద్రతపై భక్తులు ఆందోళన**

మరోవైపు, కాలినడక మార్గంలో భద్రతా ఏర్పాట్లు ఆశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేవని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లోనూ, లోతైన లోయలకు ఆనుకుని ఉన్న మార్గాల్లోనూ తగినంత బారికేడింగ్, భద్రతా మౌలిక సదుపాయాల కొరత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జనాభా నియంత్రణ, యాత్ర నిర్వహణ కోసం పోలీసులు, భద్రతా సిబ్బందిని తగినంతగా మోహరించలేదని ఆరోపిస్తున్నారు. యాత్రికుల భద్రతను నిర్ధారించడానికి, సున్నితమైన ప్రదేశాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించాలని, పటిష్ఠమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, ట్రెక్కింగ్ మార్గం వెంబడి సమర్థవంతమైన జన నియంత్రణ యంత్రాంగాలను అమలు చేయాలని భక్తులు అధికారులను కోరారు. ప్రస్తుతం, కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో పెరుగుతున్న జనసందోహం, తరచుగా ఏర్పడుతున్న రద్దీ పరిస్థితులు భక్తులకు ఆందోళన కలిగిస్తున్నాయి. కేదార్‌నాథ్ ట్రెక్కింగ్ మార్గంలో యాత్రికుల భద్రతను నిర్ధారించడానికి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని పోలీసు సూపరింటెండెంట్ నిహారిక తోమర్ తెలిపారు. మార్గంలోని ఇరుకైన ప్రదేశాల్లో యాత్రికులు ఒకరి వెనుక ఒకరు వరుసలో నడవాలని సూచనలు జారీ చేశారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తుంగనాథ్ ధామ్ వద్ద భక్తుల మధ్య ఘర్షణలు జరుగుతున్నట్లు చూపే వీడియోలు వైరల్ అవుతున్నాయని, ఈ సంఘటనలకు సంబంధించి తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**రోడ్లపై ట్రాఫిక్ జామ్- భక్తుల ఇక్కట్లు**

ఉత్తరాఖండ్‌లో ప్రస్తుతం చార్‌ధామ్ యాత్ర కొనసాగుతోంది. ఈ యాత్ర కోసం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ భారీ జనసందోహం ప్రభావం రోడ్లపై స్పష్టంగా కనిపిస్తోంది. చార్‌ధామ్ యాత్రా మార్గాల్లో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. దీంతో యాత్రికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ ట్రాఫిక్ చిక్కులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బద్రీనాథ్ ధామ్ యాత్రతో పాటు హేమకుండ్ సాహిబ్ యాత్ర కూడా ఇప్పుడు ప్రారంభమైంది. ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మరింత పెంచింది. గత నాలుగు రోజులుగా జోషీమఠ్- మార్వారీ రోడ్డు మార్గంలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో చార్‌ధామ్ యాత్రికులు, హేమకుండ్ సాహిబ్ వెళ్లే భక్తులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారు. చార్‌ధామ్ యాత్ర సందర్భంగా పెరిగిపోతున్న ఈ జనసమూహం, వాహనాల రద్దీ వల్ల ఏర్పడుతున్న నిరంతర ఒత్తిడి పోలీసులను, స్థానిక యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది.

# సంపాదకీయం

చరిత్రలో అరుదైన విచిత్రం భారత్‌లో ఆవిష్కృతమవుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి దశాబ్దాలపాటు భారత ప్రభుత్వాలు అనుసరించిన లక్ష్యం -జనాభా నిరోధం. "హమ్ దో, హమారే దో" నినాదం ఇళ్లగోడలపై రాసినా, సంతాన నియంత్రణకు ప్రోత్సాహకాలిచ్చినా, కొన్నిసార్లు బలవంతపు నిర్బంధ చర్యలకు దిగినా -కారణం ఒక్కటే.. అధిక జనాభా వలన కలిగే వనరుల కొరత, పేదరికం, అభివృద్ధి మందగమనం! ఆ ప్రయత్నాలు చివరికి ఫలించాయి, కానీ ఇప్పుడు కొత్త ప్రశ్న తలెత్తింది. అదే -లక్ష్యం సాధించిన తర్వాత ఏంచేయాలి? భారతదేశపు మొత్తం సంతానోత్పత్తి (టీఎఫ్ఆర్) రేటు దిగజారిందన్నది తాజా గణాంకాల మాట. దేశంలోని పట్టణ ప్రాంతాల టీఎఫ్ఆర్ కేవలం 1.5కి పడిపోయింది. ఇది జపాన్, దక్షిణ కొరియా, ఇటలీవంటి వయోజన దేశాల సంఖ్యకు దగ్గరగా ఉంది, అభివృద్ధి చెందుతున్న యువ దేశానికి కాదు. గ్రామీణ భారతం 2.1తో సరిగ్గా భర్తీస్థాయిలో నిలదొక్కుకున్నా, పట్టణీకరణ వేగం నేపథ్యంలో ఆ సంతులనం చాలాకాలం నిలబడదు. "జనాభా విస్ఫోటనం" భయంతో జీవించిన భారతం.. ఇప్పుడు "జనాభా కుంగుబాటు" అనే నిశ్శబ్ద సంక్షోభంలోకి అడుగుపెట్టింది. విజయం తెచ్చిన సంక్షోభమే -కళ్లముందు పెద్ద విచిత్రం!


సంతానోత్పత్తి రేటు కుంగుబాటు భారత్‌కేమీ ప్రత్యేకం కాదు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణవల్ల నివాస స్థలాలు కుచించుకుపోయాయి. జీవనవ్యయం ఆకాశాన్నంటింది. స్త్రీ విద్య, ఉద్యోగావకాశాలు విస్తృతమవ్వడం శుభపరిణామాలే అయినా... వీటి ఫలితంగా వివాహం, సంతానం ఆలస్యమౌతోంది. గర్భ నిరోధకాలు అందుబాటులోకి వచ్చాయి. అన్నింటికీమించి, ఆలోచనా విధానంలో వచ్చిన పెనుమార్పు. "ఎక్కువ పిల్లలకంటే ఒకరిద్దరితో మెరుగైన భవిష్యత్తు" అనే తత్త్వం వేళ్లూనుకుంది. ఇది అభివృద్ధి చెందిన ప్రతి దేశం దాటిన మలుపే. భారత్ ఆ మలుపును పట్టణాల్లో అంచనాకు మించిన వేగంతో చేరుకుంది. టీఎఫ్ఆర్ తగ్గడం స్వయంగా సంక్షోభం కాదు. నిజమైన ప్రమాదమున్నది పరివర్తన దశలో.. అది సమాజపు వయోజన నిర్మాణంలో చేసే తీవ్రమైన మార్పులో. భారతదేశం ఈ శతాబ్దపు మొదటి రెండు దశాబ్దాలలో "జనాభా డివిడెండ్" అనే అద్భుతమైన వరం అనుభవించింది. పని చేసే వయసు జనాభా అధికంగా ఉండటం, ఆధారపడే వృద్ధులు తక్కువగా ఉండటం. ఈ అనుకూల నిర్మాణమే భారత ఆర్థిక వ్యవస్థను వేగంగా ముందుకు నడిపింది. కానీ రాబోయే తరంలో ఈ చిత్రం తిరగబడుతుంది. పని చేసే జనాభా కుంచించుకుపోతుంది, వృద్ధ జనాభా విపరీతంగా పెరుగుతుంది. పింఛన్లు, వైద్య సేవలు, సామాజిక భద్రత సమకూర్చే బాధ్యత తక్కువ మంది పనిచేసే వారిపై పడుతుంది. ఇప్పటికే బలహీనంగా ఉన్న పింఛన్ వ్యవస్థ, ఆరోగ్య మౌలిక సదుపాయాలపై ఈ ఒత్తిడి అసాధారణ స్థాయికి చేరుతుంది.

రాజకీయ పరిణామాలు మరింత జటిలంగా మారే ప్రమాదముంది. భారత రాజ్యాంగం ప్రకారం పార్లమెంటు స్థానాల కేటాయింపు, కేంద్ర నిధుల పంపిణీ జనాభా ఆధారంగా జరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాలు -ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక జనాభా నియంత్రణలో దేశానికే ముందు నడిచాయి. మానవ వికాసంలో, స్త్రీ విద్యలో, ఆరోగ్యసేవల్లో అగ్రస్థానాల్లో నిలిచాయి.

## పిల్లల కోసం విలవిల

కానీ 2026లో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన ఈ రాష్ట్రాలకు ప్రతికూలంగా మారే అవకాశముంది. ఎందుకంటే జనాభా తక్కువగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ పార్లమెంటు స్థానాలు వస్తాయి. అభివృద్ధిని సాధించినందుకు "శిక్ష" అనుభవించే ఈ అన్యాయమైన పరిస్థితి -ప్రాంతీయ వైషమ్యాలను మరింత లోతు చేస్తుంది. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను దెబ్బతీస్తుంది. ఉత్తరాదిలో టీఎఫ్ఆర్ ఇంకా 2.5పైన ఉన్న రాష్ట్రాలు పార్లమెంటులో మరింత బలపడతాయి. ఇది ఫెడరల్ సమతుల్యతకు తీవ్రమైన సవాలు! అంతర్జాతీయ అనుభవాలు ఏం చెప్తున్నాయో పరిశీలిస్తే.. జపాన్, చైనా, దక్షిణ కొరియాలాంటి దేశాలు ఇప్పటికే ఈ సమస్యలో ఉన్నాయి. జపాన్ "విష్ణుమూర్తి" వంటి రోబో సంరక్షకులను తయారుచేసినా, దక్షిణ కొరియా లక్షల కోట్ల రూపాయల ప్రోత్సాహకాలిచ్చినా టీఎఫ్ఆర్ పెరగడం అంత సులభంగా జరగలేదు. చైనా "ఒక బిడ్డ" విధానాన్ని రద్దుచేసి "మూడు పిల్లలు" వరకూ అనుమతించినా ఫలితాలు నిరాశగా ఉన్నాయి. భారతదేశం ఈ అంతర్జాతీయ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోకపోతే, అదే తప్పులు పునరావృతమవుతాయి. కనుక ఇప్పుడు అవసరమైన వ్యూహం మూడు స్తంభాలపై నిలబడాలి. మొదటిది -తల్లిదండ్రుల పాత్రను ఆర్థికంగా సులభతరం చేయడం. పిల్లలను కనడం "ఆర్థిక శిక్ష"లా అనిపించే పరిస్థితి మారాలి. రెండవది -వృద్ధాప్య జనాభా సంక్షోభం రాకముందే సన్నద్ధం కావటం. సమర్థమైన పింఛన్ వ్యవస్థ, విస్తృతమైన వృద్ధాప్య ఆరోగ్య సేవలు, సీనియర్ సిటిజన్ల కోసం సామాజిక భద్రత ముఖ్యం. మూడవది -రాజ్యాంగపరమైన సంస్కరణ. నియోజకవర్గాల పునర్విభజనను జనాభా ఆధారం నుంచి మానవ వికాస సూచిక ఆధారంగా మార్చాలి. అభివృద్ధిని సాధించిన రాష్ట్రాలు పార్లమెంటులో బలహీనపడే పరిస్థితి ఏర్పడకూడదు; అది సాధించినందుకు బహుమతి ఇచ్చే సూత్రాలు రూపొందాలి. దీర్ఘకాలంలో చూస్తే, నిపుణ వలసదారులను ఆహ్వానించే సంస్కరణలు అవసరం కావొచ్చు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియావంటి దేశాలు వలసదారుల ద్వారా తమ శ్రామికశక్తి కొరతను భర్తీ చేస్తున్నాయి. భారతదేశం సాంప్రదాయకంగా వలసలకు విముఖం. కానీ భవిష్యత్తులో ఆ వైఖరిలో సరళత అవసరమవుతుంది. అలాగే.. ఇప్పటికే 2.5 పైన టీఎఫ్ఆర్ ఉన్న రాష్ట్రాలలో నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉద్యోగ కల్పన వేగంగా విస్తరించాలి. ఆ రాష్ట్రాల జనాభా ఉత్పాదక శక్తిగా మారాలి. అది దేశమంతటికీ మేలు.

"జనాభా తగ్గించుకోవా"లని చెప్పిన ప్రభుత్వాలు, ఇప్పుడు "జనాభా తగ్గుతోంద"ని ఆందోళన చెందడం వైరుధ్యంగా కనిపించవచ్చు. కానీ విధాన నిర్ణేతలకు ఇది తప్పించుకోలేని వాస్తవం. జనాభా నియంత్రణ విజయం ఒక తరం పాటు దేశానికి సేవ చేసింది; ఇప్పుడు ఆ విజయం కొత్త సవాళ్లను తెచ్చింది. ఆ సవాళ్లను గుర్తించి, చురుగ్గా స్పందించే ప్రభుత్వాలు మాత్రమే భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్నట్టు లెక్క. ఈ మార్పును సమర్థంగా నిర్వహించకపోతే, సాధించిన విజయం శాపంగామారే ముప్పు లేకపోలేదు. అందుకే -ఇది గణాంకాల చర్చ కాదు; ఇది రాబోయే తరాల భవిష్యత్తు గురించిన అత్యవసర జాతీయ సంభాషణ!!



## జ్ఞానానికి ప్రేమే మూలం!

1828లో రష్యాలో సంపన్న కుటుంబంలో జన్మించిన లియో టాల్‌స్టాయ్ మొదట తుపాకీపట్టి యుద్ధభూమిలో నడిచారు. కానీ అదే చేతులతో కలాన్ని పట్టుకుని ప్రపంచ సాహిత్యాన్ని శాసించారు. 'వార్ అండ్ పీస్', 'అన్నా కరెనీనా' వంటి అజరామర నవలలు రాసిన ఆయన -కేవలం కథకుడు మాత్రమే కాదు, ఒక తాత్త్వికుడు, సంఘ సంస్కర్త, ఆధ్యాత్మిక దార్శనికుడు. ఆయన అహింస సిద్ధాంతాలు మహాత్మాగాంధీని నేరుగా ప్రభావితం చేశాయి. ఇద్దరి మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయి, గాంధీజీ స్వయంగా టాల్‌స్టాయ్‌ను తన గురువులలో ఒకరిగా పేర్కొన్నారు. టాల్‌స్టాయ్ చెప్పిన ఒక మాట ఈ నాటికీ మనసును తాకుతుంది: "నాకు తెలిసిన ప్రతి విషయం, నేను అర్థం చేసుకున్న ప్రతిదీ కేవలం నేను ప్రేమించడం వల్లనే సాధ్యమైంది." 'వార్ అండ్ పీస్' నవలలో మరణశయ్యపై ఉన్న ప్రిన్స్ ఆంద్రూ ఆలోచనల ద్వారా టాల్‌స్టాయ్ ఈ సత్యాన్ని సున్నితంగా పలికించారు. జీవితపు చరమ ఘడియల్లో ఒక మనిషికి కలిగే స్పష్టత -అది తర్కం నుండి కాదు, ప్రేమ నుండే పుడుతుందని నిరూపించారు.

మనం సాధారణంగా అవగాహన అంటే సమాచారం, తర్కం, విశ్లేషణ అనుకుంటాం. కానీ టాల్‌స్టాయ్ దృష్టిలో అవి మెదడుకు సంబంధించిన పనులు మాత్రమే. హృదయానికి సంబంధించినవి కావు. ఒక వ్యక్తిపై నిజమైన శ్రద్ధ ఉన్నప్పుడే వారిలోని భయాన్ని, దాగున్న బాధను, చెప్పలేని ఆశలను మనం పసిగట్టగలం. ప్రేమ లేనిచోట మనం అవతలి వారిని అర్థం చేసుకోవడానికి ముందే తప్పు పట్టడానికి సిద్ధంగా ఉంటాం. ఒక తల్లి తన బిడ్డలో, ఒక గురువు తన శిష్యుడిలో చూసే లోతు -అది ప్రేమ ఇచ్చే కన్ను మాత్రమే చూడగలదు.

నేటి సోషల్ మీడియా యుగంలో ఈ పాఠం మరింత అవసరం. ఒక్క పోస్టు చూసి మనుషులపై ముద్రలు వేయడం, వాదనలో గెలవడం కోసం అర్థం చేసుకోవడం మానేయడం ఇవి నిత్యకృత్యాలుగా మారిపోయాయి. సంబంధాల్లో ఘర్షణలు వచ్చేది మాటలు వినిపించకపోవడం వల్ల కాదు, ఆ మాటల వెనుక ఉన్న నొప్పిని ప్రేమతో గుర్తించకపోవడం వల్లనే అని టాల్‌స్టాయ్ నమ్మారు. ఒక నాయకుడు తన ప్రజలను, ఒక అధికారి తన ఉద్యోగులను నిజంగా ప్రేమించగలిగినప్పుడే సమస్యల మూలాల వరకు చేరగలడు. ఆయన తన జీవితంలో కూడా ఈ విలువలను ఆచరించారు. భూస్వామి కుటుంబంలో పుట్టినా రైతుల పక్షాన నిలిచారు. అత్యంత ప్రసిద్ధుడైనా జీవితపు చివరి దశలో సర్వస్వాన్ని వదులుకుని సాదా జీవనం గడిపారు. రెండు శతాబ్దాల తర్వాత కూడా టాల్‌స్టాయ్ మాటలు మనకు గుర్తు చేస్తున్నాయి. నిజమైన జ్ఞానానికి మొదలు తర్కం కాదు, ప్రేమ!

టాల్‌స్టాయ్ జీవితం కేవలం సాహిత్యానికే పరిమితం కాలేదు. ఆయన స్వయంగా ఒక జీవన ప్రయోగశాల. తన భూమిని రైతులకు పంచిపెట్టాలని, బానిసత్వాన్ని రద్దు చేయాలని ప్రభుత్వంతో నేరుగా తలపడ్డారు. సంపదను, కీర్తిని తృణప్రాయంగా విడిచి 82 ఏళ్ల వయసులో ఇల్లు వదిలి వెళ్లిపోయారు. ఆ ప్రయాణంలోనే రైల్వే స్టేషన్‌లో తుది శ్వాస విడిచారు. చనిపోయే ముందు కూడా ఆయన నోట వెలువడిన మాట: "సత్యాన్ని వెతకడం మానకండి." రష్యన్ చర్చి ఆయన్ను మతం నుండి బహిష్కరించినా, ప్రజలు మాత్రం ఆయన్ను దేవుడిలా పూజించారు. ఇప్పటికీ ప్రపంచంలో అత్యధికంగా చదివే రచయితల జాబితాలో టాల్‌స్టాయ్ పేరు మొదటి వరుసలోనే ఉంటుంది, ఎందుకంటే ఆయన రాసింది కేవలం పాత్రల గురించి కాదు, మన గురించే.

# పంట పండించినా... పస్తులే!?

అప్పు చేసి విత్తు వేసి రేయింబవళ్లు కష్టపడి పండించిన పంట -అకాల వర్షానికి కళ్ల ముందే నీటిపాలవుతుంటే రైతు నిస్సహాయంగా చూస్తున్నాడు. ఇది ఈ ఏడాది మాత్రమే జరిగిన విషాదం కాదు; ఏటా తెలంగాణ సహా దేశమంతటా పునరావృతమయ్యే శోకగాథ. 35.77 కోట్ల టన్నుల రికార్డు ఉత్పత్తి సాధిస్తున్న భారతదేశంలో సగానికి పైగా పంటకు గిడ్డంగి సదుపాయమే లేదు; ఉద్యాన పంటలకు పది శాతానికి మాత్రమే శీతల నిల్వ అందుబాటులో ఉంది. పండించే శ్రమ రైతుది, నష్టమూ రైతుదే -లాభం మాత్రం దళారులది అనే చట్రం నుంచి భారత్ బయటపడలేకపోతోంది. పరిహారాలు ప్రకటించే ప్రభుత్వాలకంటే పరిహారమే అవసరం లేకుండా చేసే వ్యవస్థ కావాలి. పల్లెస్థాయి గిడ్డంగులు, శీతల గిడ్డంగుల విస్తరణ, కొనుగోలు కేంద్రాల్లో రక్షణ చర్యలు ఇప్పుడు అత్యవసరం. "ఏటా ఇదే దురవస్థ" అనే ఆవేదన ఆగాలంటే -వ్యవస్థాగత లోపాలను తక్షణం సరిదిద్దే రాజకీయ సంకల్పం చాటాల్సిన సమయం ఆసన్నమైంది!!



అప్పో సప్పో చేసి పెట్టుబడులు సమకూర్చుకుని పొలంలోకి దిగిన రైతు, పైరును కన్నబిడ్డలా సాకుతాడు. రేయింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకుంటాడు. "ఈసారైనా గట్టెక్కుతాం" అని ఆశతో ఎదురుచూస్తాడు. కానీ చేతికొచ్చిన పంట కళ్లముందే వర్షానికి తడిసి మురికిపాలైతే -ఆ అన్నదాత గుండె అవిసిపోవడానికి మాటలు చాలవు. దేశవ్యాప్తంగా ఏటా ఈ విషాదం పునరావృతమవుతోంది. తాజాగా తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలు మళ్లీ అదే గాయాన్ని చేశాయి. కల్లాల్లో, రోడ్ల పక్కన, కొనుగోలు కేంద్రాల్లో, మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న తడిసి ముద్దయింది. కొన్నిచోట్ల వరదలో కొట్టుకుపోయింది. ఆరుగాలం శ్రమించిన రైతుకు మిగిలింది కన్నీరు మాత్రమే. ఇది ఒక సీజన్ దురదృష్టం కాదు -ఇది ఏళ్ల తరబడి పరిష్కారం కాని వ్యవస్థాగత వైఫల్యం.

పర్యావరణ విపరిణామాలతో వాతావరణం ఎప్పుడెలా మారుతుందో తెలియడం లేదు. ఉన్నట్టుండి కురిసే వర్షాలు, వరదలు, వడగళ్ల వానలు -ఇవన్నీ రైతుకు నిత్య శత్రువులుగా మారాయి. వాతావరణ మార్పు ఒకవైపు నిలిచి పాత పంచాంగాలను, రైతు అనుభవ జ్ఞానాన్ని పెళ్లగించేసింది. పండిన పంటను కాపాడుకోవడమే ఇప్పుడు అతి పెద్ద సవాలు. కానీ ఈ సవాలుకు స్పందించే మౌలిక సదుపాయాలు, విధాన చట్రం దేశంలో ఇంకా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదు. ప్రభుత్వాలు ప్రతి ఏడాది నష్టపోయిన రైతులకు పరిహారం ప్రకటించడమే తప్ప, ఈ నష్టాలు మళ్లీ రాకుండా చేసే దీర్ఘకాలిక చర్యలు చేపట్టడంలో వెనకడుగు వేస్తున్నాయి. ఈ తేడాయే రైతు జీవితాన్ని అదే చక్రంలో బంధిస్తోంది.


ఒక విచిత్రమైన వైరుధ్యం భారత వ్యవసాయ రంగంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు ఆహారధాన్యాల ఉత్పత్తి ఏటేటా రికార్డులు సృష్టిస్తోంది. 2024-25లో 35.77 కోట్ల టన్నులకు చేరింది. ఇది స్వాతంత్ర్యం వచ్చిన నాటికంటే పదిహేను రెట్లు ఎక్కువ. భారత రైతు అన్నప్రాశన చేయించిన దేశం ఆకలి సూచిలో క్రమంగా మెరుగుపడుతోంది. కానీ ఇంకోవైపు ఈ ఉత్పత్తిని సురక్షితంగా నిల్వ చేసే సదుపాయాలు విషాదకరమైన స్థాయిలో వెనకబడి ఉన్నాయి. దేశంలో కేవలం 47 శాతం ధాన్యానికి మాత్రమే గిడ్డంగి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఉద్యాన పంటలు (పండ్లు, కూరగాయలు) విషయంలో పరిస్థితి మరీ దారుణం. కేవలం పది శాతానికి మాత్రమే శీతల గిడ్డంగి సదుపాయముంది. ఫలితంగా పెద్ద మొత్తంలో ఆహార పదార్థాలు పొలాల్లోనూ, నిల్వ కేంద్రాల్లోనూ చెడిపోయి వృథా అవుతున్నాయి.

ఉన్న గిడ్డంగులు ఉపయోగించుకుందామనుకుంటే అవి చిన్న రైతుకు రెండు కారణాల వల్ల అందుబాటులో ఉండవు. ఒకటి, వాటి అద్దె ఖర్చులు సాధారణ రైతులు భరించలేనంతగా ఉంటున్నాయి. రెండు, ఎక్కువశాతం గిడ్డంగులు జిల్లా కేంద్రాల సమీపంలోనే ఉంటున్నాయి. సన్నకారు రైతులు తమ పంటలను అంతదూరం తీసుకెళ్లడం ఆర్థికంగా, లాజిస్టిక్స్ రీత్యా కష్టతరం. దీంతో చాలామంది రైతులు మద్దతు ధర రాకముందే, సరైన మార్కెట్ దొరకకముందే పంటలు తెగనమ్ముకోవలసిన నిస్సహాయ స్థితిలో పడిపోతున్నారు. ఉత్పత్తి పెరిగినా రైతు ఆదాయం పెరగకపోవడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం. పండించే శ్రమ రైతుది, లాభం దళారులది. ఈ చక్రం విడిపోవడం లేదు.

ప్రభుత్వ స్పందన చూస్తే -అకాల వర్షాలు పడిన ప్రతిసారీ నష్ట సర్వేలు, పరిహార ప్రకటనలు వెలువడతాయి. కానీ ఈ చర్యలు రైతు గాయానికి వేసే తాత్కాలిక పట్టీలు మాత్రమే. పొలం దగ్గరే గిడ్డంగి సదుపాయం ఎందుకు లేదు? కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి సరైన కప్పు ఏర్పాటు ఎందుకు జరగలేదు? వర్షాలను ముందే పసిగట్టి రైతులను హెచ్చరించే సమర్థమైన వ్యవస్థ ఎందుకు పనిచేయడం లేదు? ఈ ప్రశ్నలకు ప్రతి ఏడాది జవాబు లేదు. ఎందుకంటే వ్యవస్థాగత మూలాలను పరిష్కరించే రాజకీయ సంకల్పం చాలాచోట్ల కొరవడుతోంది.

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? మొదటిది -పల్లె స్థాయిలో గిడ్డంగుల నిర్మాణం. రైతుకు పది, పదిహేను కిలోమీటర్ల దూరంలో నిల్వ సదుపాయం ఉంటే చాలు. ఆ ఒక్క మార్పే అన్నదాత జీవితాన్ని పూర్తిగా మార్చగలదు. ప్రైవేట్ పెట్టుబడిదారులను, సహకార సంఘాలను గ్రామాల్లో గిడ్డంగులు నిర్మించేందుకు ప్రభుత్వాలు పన్ను రాయితీలు, రాయితీ రుణాలతో ప్రోత్సహించాలి. రెండవది -శీతల గిడ్డంగుల విస్తరణ. పండ్లు, కూరగాయలు అతి తక్కువ కాలంలో పాడైపోతాయి. ఆధునిక కోల్డ్ చెయిన్ మౌలిక సదుపాయాలు ఉద్యాన రైతుల ఆదాయాలను రెట్టింపు చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఇందుకోసం ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. మూడవది -కొనుగోలు కేంద్రాల్లో అత్యవసర రక్షణ చర్యలు. తేమ తట్టుకునే కప్పులు, త్వరితగతిన సమకూర్చగల ట్యార్పాలిన్ నిల్వలు, వర్షంముందే హెచ్చరించే స్థానిక వాతావరణ నెట్‌వర్క్ -ఇవి పెద్ద ఖర్చులేని చర్యలు. కానీ అమలులో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

భారతదేశం 35 కోట్ల టన్నులపైగా ధాన్యం పండిస్తోంది. కానీ ఆ ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసే వ్యవస్థ లేకుండా ఈ ఉత్పత్తి రికార్డులు అర్థం కోల్పోతాయి. పండించడం విజయం, నిల్వ చేయడం నిర్లక్ష్యం -ఈ వైరుధ్యం కొనసాగినంత కాలం రైతు శ్రమ వ్యర్థమవుతూనే ఉంటుంది. అన్నదాత కష్టానికి విలువ ఇవ్వాలంటే.. పరిహారం ప్రకటించే ప్రభుత్వం కాదు కావలసింది, పరిహారం అవసరమే లేకుండా చేసే వ్యవస్థ కావాలి. "ఏటా ఇదే దురవస్థ" అనే ఆవేదన మళ్లీ వినరాదంటే, వ్యవస్థాగత లోపాలను తక్షణం పరిష్కరించాలి. రైతు మనుగడే దేశ మనుగడ. ఈ సత్యాన్ని విధాన రూపకర్తలు మరోసారి గుర్తుచేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది!! ■



బిస్కట్లు, చిప్స్‌వంటి చిరుతిళ్లు పక్కనపెట్టి బాదంతో చేసిన తినుబండారాలు అలవాటు చేసుకుంటే ఆరోగ్యానికి మేలు. బాదంలో ఉండే పీచు పదార్థం, ఆరోగ్యకరమైన కొవ్వులు పేగుల్లో మేలు చేసే బ్యాక్టీరియా పెరగడానికి దోహదపడతాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థ బలోపేతమవుతుంది. అంతేకాకుండా శరీరంలో అనేక రకాల వాపు సమస్యలు తగ్గి రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. కడుపు నిండిన భావనను కలిగించే హార్మోన్ల ఉత్పత్తి పెరగడం వల్ల అనవసరంగా తినే అలవాటు తగ్గి, అధిక బరువు సమస్య క్రమంగా అదుపులోకి వస్తుంది. చిరు ఆహారపు అలవాటులో ఈ చిన్న మార్పు దీర్ఘకాలంలో పెద్ద తేడా తీసుకొస్తుంది.

-మహాదేవ

**వింతల్లో వింతలు**

## ఉక్కు 'చేతలు!



చైనాకు చెందిన కుంగ్‌ఫూ మాస్టర్ జాంగ్ లాంగ్‌జియాంగ్ చేతులు చూస్తే "ఇవి చేతులా, లేక ఇటుకలా?" అని అడగాలనిపిస్తుంది! 53 ఏళ్ల ఈ వ్యక్తి 20ఏళ్లు "అయరన్ శాండ్ పామ్" అనే పురాతన షావోలిన్ కుంగ్‌ఫూ విద్యను నిత్యం రెండు మూడు గంటలు సాధన చేశాడు. రోజూ ఉక్కు బంతులు నింపిన శాండ్‌బ్యాగ్‌ను 6,000 సార్లు కొట్టడమే దినచర్య! ఫలితం? అతని అరచేయి మందం 8 సెంటీమీటర్లు. సగటు మనిషి రెండు చేతులు అతికించినా సరితూగవు. ఆ చేతులతో ఇటుక పలకలు బద్దలు కొట్టడం, చెక్కలో మేకులు దిగగొట్టడం అతనికి చిటికె వేసినంత పని! "రహస్యమేమీ లేదు -సాధనే సర్వస్వం" అంటాడు జాంగ్. నిజంగా వారెవా!

# నీదా.. నాదా

## రెండో టైటిల్‌పై బెంగళూరు, గుజరాత్ గురి

## ఐపీఎల్-19 తుదిపోరు నేడే

## రాత్రి 7.30 నుంచి



**18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ గత ఏడాది ఐపీఎల్ ట్రోఫీ కల నెరవేర్చుకున్న ఆర్సీబీ, వరుసగా రెండో టైటిల్ పట్టేయాలని పట్టుదల ప్రదర్శిస్తుంటే.. ఐపీఎల్‌లో అడుగు పెట్టిన తొలి ఏడాదే ఛాంపియన్‌గా కావడమే కాక అయిదేళ్లలో మూడో ఫైనల్ ఆడబోతున్న జీటీ కూడా రెండో కప్పుపై కన్నేసింది.**

**మరి ఆదివారం సమవుజ్జీల పోరులా కనిపిస్తున్న ఫైనల్లో అ'ద్వితీయ' విజయాన్నందుకునే జట్టేదో?**

ప్రపంచ క్రికెట్ ప్రేమికుల ఫేవరెట్ లీగ్ ఐపీఎల్‌లో ఈ సీజన్‌కు మిగిలింది ఇంకొక్కటే మ్యాచ్. రెండు నెలల పాటు అభిమానులను ఉర్రూతలూగించిన లీగ్‌లో ఆఖరి పోరుకు వేళైంది. ఆదివారం ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును.. 2022 విజేత గుజరాత్ టైటాన్స్ ఢీకొనబోతోంది. టోర్నీలో అత్యుత్తమ జట్ల మధ్యే ఫైనల్ జరుగుతుండడం.. ఆల్‌రౌండ్ బలంతో సమవుజ్జీల్లా కనిపిస్తున్న టీమ్స్‌లో ఎవరు విజేతగా నిలుస్తారో చెప్పలేని పరిస్థితి ఉండడం ఈ పోరుపై ఆసక్తిని పెంచుతోంది. ఇరు జట్లూ రెండో కప్పు మీదే గురి పెట్టడం విశేషం. తన సొంతగడ్డ అహ్మదాబాద్‌లో ఆడబోతుండడం గుజరాత్‌కు సానుకూలాంశం కాగా.. క్వాలిఫయర్-1లో ఇదే ప్రత్యర్థిని చిత్తుగా ఓడించడం బెంగళూరు ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే.

**ఆ ముగ్గురిని పడగొడితే..**

ఈ ఐపీఎల్‌లో మిగతా జట్లతో పోలిస్తే గుజరాత్‌ది అంత బలమైన బ్యాటింగ్ ఆర్డరేమీ కాదు. ముఖ్యంగా మిడిలార్డర్ అయితే లీగ్‌లోనే అత్యంత బలహీనం అని చెప్పొచ్చు. వాషింగ్టన్ సుందర్, నిశాంత్ సింధు, రాహుల్ తెవాతియా, హోల్డర్.. నాలుగో స్థానం నుంచి ఇదీ ఆ జట్టు బ్యాటింగ్ లైనప్. అయినా సరే జీటీ ఇంత నిలకడగా ఆడి, ఫైనల్‌కు వచ్చిందంటే అందుకు ప్రధాన కారణం టాప్-3 బ్యాటర్లు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్‌లతో కూడిన ఓపెనింగ్ జోడీ గుజరాత్‌కు అతి పెద్ద బలం. క్వాలిఫయర్-2లో బ్యాటింగ్‌కు కాస్త కష్టంగా ఉన్న పిచ్‌పై 215 పరుగుల భారీ లక్ష్యం నిలిచినా, గుజరాత్ ఏమాత్రం ఛేదించేసిందంటే అందుకు గిల్, సుదర్శన్ వేసిన తిరుగులేని పునాదే కారణం. ఈ జోడీ ఏకంగా 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. గిల్ సెంచరీ కొడితే, సుదర్శన్ అర్ధశతకం సాధించాడు. లీగ్ దశలో కూడా ఈ జోడీ అనేక మ్యాచ్‌ల్లో జట్టుకు అద్భుత ఆరంభాలందించింది. టోర్నీలో అత్యధిక పరుగుల వీరుల్లో 2, 3 స్థానాల్లో ఉన్నారు గిల్, సుదర్శన్. మూడో నంబర్లో ఆడే బట్లర్ సైతం 500 పైచిలుకు పరుగులు సాధించాడు. కొన్ని మ్యాచ్‌ల్లో అతను కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. జీటీ బ్యాటింగ్ భారాన్ని చాలా వరకు ఈ ముగ్గురే మోస్తున్నారు. ఈ ముగ్గురూ విఫలమైన రోజు గుజరాత్‌కు ఇబ్బందే. ముఖ్యంగా ఓపెనర్లు త్వరగా ఔటైపోతే జీటీ పనైపోతుంది. క్వాలిఫయర్-1లో భారీ స్కోరు సాధించిన ఆర్సీబీ.. గిల్, సుదర్శన్‌లను ఆరంభంలోనే పెవిలియన్ చేర్చి విజయాన్ని ఖాయం చేసుకుంది. ఫైనల్లోనూ ఇలాగే గుజరాత్‌ను దెబ్బ తీయాలని ఆర్సీబీ ప్రయత్నిస్తుందనడంలో సందేహం లేదు. మిగతా బ్యాటర్లలో సుందర్ ఒక్కడే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌లు ఆడాడు. నిశాంత్ సింధు, తెవాతియా, హోల్డర్‌లపై పెద్దగా అంచనాలు లేవు. జీటీ టాప్-3 బ్యాటర్లు విఫలమైతే.. మిగతా బ్యాటింగ్ ఆర్డర్ ఏమేర జట్టును నిలబెడుతుందన్నది ప్రశ్నార్థకం.

**ఒకరు పోతే ఇంకొకరు..**

బెంగళూరు గత ఏడాది ఛాంపియన్ అయిందన్నా, ఈసారి కూడా ఆధిపత్యం చలాయిస్తూ ఫైనల్ చేరిందన్నా.. అందుకు ప్రధాన కారణం, ఒకప్పట్లా బ్యాటింగ్‌లో ఒకరిద్దరి మీద ఆధారపడే పరిస్థితి లేకపోవడం. ఒకరు పోతే ఇంకొకరు అన్నట్లుగా చాలామంది మ్యాచ్ విన్నర్లుండడం.. ఆరంభం నుంచి చివరి వరకు విధ్వంసం కొనసాగించే ఆటగాళ్లతో బ్యాటింగ్ ఆర్డర్ నిండి ఉండడంతో ఆ జట్టుకు తిరుగులేకుండా పోతోంది. ఆ జట్టులో కాస్త ఆచితూచి ఆడేది కోహ్లి మాత్రమే. సీజన్ ప్రథమార్ధంలో ఫిల్ సాల్ట్ రూపంలో ఆ జట్టుకు విధ్వంసక ఓపెనర్ అందుబాటులో ఉన్నాడు. అతను గాయపడ్డాక ఆర్సీబీ కాస్త ఇబ్బంది పడ్డప్పటికీ.. ఆఖర్లో వెంకటేశ్ అయ్యర్ రూపంలో దూకుడైన బ్యాటర్ కలిసి వచ్చాడు. మూడో స్థానంలో ఆడే దేవ్‌దత్ పడిక్కల్ చెలరేగి ఆడుతున్నాడు. ఇక కెప్టెన్ రజత్ పాటీదార్ ప్రశాంతంగా కనిపిస్తూనే ప్రత్యర్థి బౌలింగ్‌ను ఊచకోత కోస్తాడు. క్వాలిఫయర్‌లో అతనెలా రెచ్చిపోయాడో తెలిసిందే. ఇంకా టిమ్ డేవిడ్, జితేశ్ శర్మ, కృనాల్ పాండ్య, రొమారియో షెపర్డ్‌ల రూపంలో ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపునివ్వగల బ్యాటర్లు ఆర్సీబీకి ఉన్నారు. ఎక్కువమంది హిట్టర్లు ఉండడం వల్ల ఆ జట్టు స్కోరు వేగం ఏ దశలోనూ తగ్గదు. లక్ష్యాలు పెద్దవైనా ఆ జట్టు తొణకదు. 200 పైచిలుకు స్కోర్లు చేయడం, 200ం లక్ష్యాలను ఛేదించడం ఆర్సీబీ అలవాటుగా మార్చుకుంది. ఈ సీజన్లో ఒక్క మ్యాచ్‌లో మాత్రమే ఆ జట్టు బ్యాటింగ్ ఆర్డర్ పూర్తిగా విఫలమైంది. అది ఫైనల్ ప్రత్యర్థి గుజరాత్‌తోనే కావడం గమనార్హం. ఆర్సీబీ 155 పరుగులకే పరిమితమైన ఆ మ్యాచ్‌లో జీటీ 4 వికెట్ల తేడాతో నెగ్గింది. మరోసారి అలా కుప్పకూల్చితే తప్ప.. జీటీకి ఆర్సీబీ బ్యాటర్ల నుంచి ఇబ్బందులు తప్పకపోవచ్చు.

**'కింగ్' ముద్ర వేస్తాడా?**

వయసు పెరిగే కొద్దీ బ్యాటర్ల ఫామ్ తగ్గుతుంటుంది. మధ్యలో కోహ్లి సైతం ఇలా ఇబ్బంది పడ్డవాడే. కానీ మళ్లీ లయ అందుకున్న కింగ్.. రెండేళ్లుగా చెలరేగి ఆడుతున్నాడు. ఐపీఎల్‌లో కూడా అతను నిలకడగా రాణిస్తున్నాడు. యువ బ్యాటర్ల హవా సాగుతున్న లీగ్‌లో బలమైన ముద్ర వేసిన సీనియర్ బ్యాటర్లలో అతను ముందున్నాడు. ఈ సీజన్లో కోహ్లి 600 పరుగులు చేయడం విశేషం. గత ఏడాది ఫైనల్లో ఆర్సీబీ జట్టులో 43 పరుగులతో అతనే టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఈ సీజన్ క్వాలిఫయర్‌లో కూడా 43 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు.



# ఆసియా క్రీడల ప్రాబబుల్స్‌లో వైభవ్

దిల్లీ: భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ సీనియర్ జట్టులో చోటు దిశగా దూసుకెళ్తున్నాడు. సెప్టెంబరులో మొదలయ్యే ఆసియా క్రీడల కోసం భారత ఒలింపిక్ సంఘానికి బీసీసీఐ సమర్పించిన 30 మంది సభ్యుల టీమ్‌ఇండియా ప్రాబబుల్స్‌లో వైభవ్ కూడా ఉన్నాడు. ఆసియా క్రీడలు జరిగే సమయంలోనే వెస్టిండీస్‌తో సొంతగడ్డపై పరిమిత ఓవర్ల సిరీస్ (3 వన్డేలు, 5 టీ20లు) ఉండడంతో బీసీసీఐ రెండు వేర్వేరు టీ20 జట్లను ఎంపిక చేయబోతోంది. అందుకే 30 మంది ప్రాబబుల్స్ జాబితాను ప్రకటించింది. గత ఆసియా క్రీడల్లో భారత్‌కు స్వర్ణం అందించిన సారథి రుతురాజ్ గైక్వాడ్ కూడా ఈ జట్టులో ఉన్నాడు. పేసర్ హర్షిత్ రాణా ఫిట్‌గా లేకపోయినా.. ఆసియా క్రీడల ఆరంభం నాటికి ఫిట్‌నెస్ సాధిస్తాడన్న ఉద్దేశంతో ఎంపిక చేశారు. టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు ఈ జాబితాలో చోటు దక్కలేదు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు సారథ్యం వహించనున్న నేపథ్యంలో శుభ్‌మన్ గిల్‌ను కూడా ప్రాబబుల్స్‌కు ఎంపిక చేయలేదు. ఈ క్రీడల్లో ఆడే టీమ్‌ఇండియాకు శ్రేయస్, సంజు, తిలక్‌లలో ఒకరు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశముంది. సెప్టెంబరు 24-అక్టోబరు 3 మధ్య ఆసియా క్రీడల్లో క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. సెప్టెంబరు 27 నుంచి భారత్-వెస్టిండీస్‌తో సిరీస్ మొదలవుతుంది. ప్రాబబుల్స్: యశస్వి జైస్వాల్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్, శ్రేయస్, పంత్, హార్దిక్, రింకు, తిలక్, బుమ్రా, అక్షర్, అర్ష్‌దీప్, కుల్‌దీప్, నితీశ్‌కుమార్, ప్రసిద్ధ్ కృష్ణ, వరుణ్ చక్రవర్తి, అనుకుల్ రాయ్, ఆయుష్ బదోని, హర్ష్ దూబె, ధ్రువ్ జురెల్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, రవి బిష్ణోయ్, షాబాజ్ అహ్మద్, శివమ్ దూబె, విప్రాజ్ నిగమ్, హర్షిత్ రాణా, యశ్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్. త



ప్రగ్యా నాగ్రా అద్భుతమైన రాయల్ బ్లూ గ్లామ్ ఫోటోషూట్‌లో తలపడింది

# ఇప్పుడు టెంపర్ వస్తే రూ.1000 కోట్లు సాధిస్తుందా? సాధ్యమేనా?



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ కెరీర్ ను మలుపు తిప్పిన సినిమాల్లో టెంపర్ కచ్చితంగా ముందు వరుసలో ఉంటుంది. 2015లో విడుదలైన ఆ సినిమా తారక్ లోని నటుడిని మరోస్థాయికి తీసుకెళ్లిందనే అభిప్రాయం అభిమానుల్లో ఇప్పటికీ ఉంది. తాజాగా నిర్మాత నిర్మాత బండ్ల గణేష్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఇప్పుడు టెంపర్ తీస్తే రూ.1000 కోట్లు వచ్చేవంటూ ఆయన చేసిన కామెంట్స్ పై నెట్టింట చర్చ మొదలైంది.నటుడు రాజా రవీంద్రతో బండ్ల గణేష్ పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. బాద్ షా తర్వాత తారక్ కు వరుసగా ఫ్లాపులు వచ్చాయని, రామయ్య వస్తావయ్యా, రభస ఆశించిన స్థాయిలో ఆడలేదని గుర్తు చేశారు. అలాంటి సమయంలో వక్కంతం వంశీ చెప్పిన కథ తనకు బాగా నచ్చిందని, ఆ స్టోరీ దర్శకుడు పూరీ జగన్నాథ్ దగ్గరకు తీసుకెళ్లినట్లు చెప్పారు. కథ విన్న వెంటనే 'ఇది నీకు మరో 'గబ్బర్ సింగ్' అవుతుంది' అని పూరీ చెప్పారని బండ్ల గణేశ్ వెల్లడించారు.అయితే అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే.. నిజంగానే ఇప్పుడు టెంపర్ విడుదలైతే రూ.1000 కోట్లు సాధించేదా? సినీ ఎక్స్పర్ట్స్ అభిప్రాయం ప్రకారం దీనికి కచ్చితమైన సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే 2015లోని మార్కెట్ పరిస్థితులకు ఇప్పటి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. అప్పట్లో పాన్ ఇండియా మార్కెట్ ఈ స్థాయిలో లేదు. ఓటీటీ ప్రభావం కూడా తక్కువే. టికెట్ ధరలు, థియేటర్ కలెక్షన్లు, ఓవర్సీస్ మార్కెట్, డిజిటల్ రైట్స్.. అన్నీ ఇప్పుడు భారీగా పెరిగాయి.అదే సమయంలో ప్రస్తుతం తారక్ మార్కెట్ విపరీతంగా పెరిగింది. ఆర్ఆర్ఆర్ తర్వాత ఆయనకు పాన్ ఇండియా రేంజ్ గుర్తింపు వచ్చింది. హిందీ మార్కెట్ లో కూడా మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. అందుకే అభిమానులు ఇప్పటి తారక్ తో అదే స్థాయి కంటెంట్ వస్తే భారీ వసూళ్లు సాధించే అవకాశం ఉండేదేమోనని అభిప్రాయపడుతున్నారు. అయితే రూ.1000 కోట్లు అంటే మాత్రం చాలా పెద్ద టార్గెట్ అని మరికొందరు అంటున్నారు.టెంపర్ కథ కూడా ప్రేక్షకులకు మంచిగా కనెక్ట్ అయింది. అవినీతిపరుడైన పోలీస్ అధికారి దయా జీవితంలో జరిగిన సంఘటనలు అతడిని ఎలా మార్చాయనే అంశాన్ని దర్శకుడు చూపించారు. ముఖ్యంగా క్లైమాక్స్ కోర్టు సీన్ లో తారక్ యాక్టింగ్ కు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆ సన్నివేశం ఇప్పటికీ తెలుగు సినీ అభిమానులు గుర్తు చేసుకునే క్లాసిక్ మోమెంట్ గా నిలిచింది.సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటించగా, ప్రకాష్ రాజ్ విలన్ పాత్రలో ఆకట్టుకున్నారు. పూరీ జగన్నాథ్ మార్క్ డైలాగ్స్, యాక్షన్ ఎలివేషన్స్, తారక్ ఎనర్జీ కలిసి సినిమాను బ్లాక్ బస్టర్ గా నిలిపాయి. అప్పట్లో ఆ చిత్రం తారక్ కెరీర్ కు పెద్ద బూస్ట్ ఇచ్చింది. ఆ తర్వాత ఆయన వరుస విజయాలతో స్టార్ హీరోగా మరింత ఎదిగిపోయారు. ఏదేమైనా బండ్ల గణేష్ చేసిన రూ.1000 కోట్ల కామెంట్ కాస్త అతిశయోక్తిగా అనిపించినా.. టెంపర్ తారక్ కెరీర్ లో స్పెషల్ మూవీ అని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు.



మృణాల్ ఠాకూర్ బోల్డ్ స్ట్రిప్డ్ లుక్‌లో స్టన్స్, అభిమానులు ఆమెను ఫ్యాషన్ క్వీన్ అని పిలుస్తారు

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com